http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఆదివారం 17 ఆగస్టు 2025

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



# 20 నెలలు.. 20వేల కోట్లు

ప్రతిపక్షంలో ఉన్న పార్టీ అప్పులు చేస్తున్నారని గగ్గోలు

మనదేశంలో ప్రతి రాష్ట్రంలో అధికార ప్రతిపక్షాల మధ్య నిత్యం ఇలాంటి గోల జరుగుతూనే ఉంటుంది.

అప్పుల వల్ల తెలంగాణ రాష్ట్రం ఆగమవుతుందనే పిలాసఫీ ఆయన నోటి వెంట నుంచి వస్తోంది

సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ కేటీఆర్ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం అనవసరంగా అప్పులు చేస్తుందనే మాట వినిపిస్తోంది.

హైదరాబాద్

అధికారంలో ఉన్న పార్టీ అభివృద్ధి చేస్తున్నామని చెబుతుంది. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ అప్పులు చేస్తున్నారని గగ్గోలు పెడుతుంది. మనదేశంలో ప్రతి రాష్ట్రంలో అధికార ప్రతిపక్షాల మధ్య నిత్యం ఇలాంటి గోల జరుగుతూనే ఉంటుంది. దీనికి తెలంగాణ రాష్ట్రం మినహాయింపు కాదు. తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు అప్పులు చేసింది. ఆ అప్పుల మొత్తాన్ని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఖర్చు చేసినట్టు అప్పట్లో కేటీఆర్ సెలవిచ్చారు. ఆస్తుల కల్పన కోసమే తాము అప్పులు చేస్తున్నట్టు కేటీఆర్ వ్యాఖ్యానించారు. కానీ ఇప్పుడు కేటీఆర్ ప్రతిపక్ష పార్టీలోకి మారిపోవడంతో.. అకస్మాత్తుగా ఆయనకు అప్పులు అంటే ఒక బ్రహ్మ పదార్థం లాగా కనిపిస్తోంది. అప్పులు చేయకూడదని.. అప్పుల వల్ల తెలంగాణ రాష్ట్రం ఆగమవుతుందనే పిలాసఫీ ఆయన నోటి వెంట నుంచి వస్తోంది. సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ కేటీఆర్ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం అనవసరంగా అప్పులు చేస్తుందనే మాట వినిపిస్తోంది.ఇక అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ భారత రాష్ట్ర సమితి చేసిన అప్పులపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేసింది. అనేక సందర్భాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భారత రాష్ట్ర సమితి నాయకులు చేస్తున్న అప్పులపై వ్యతిరేక స్వరం వినిపించారు. నిండు శాసనసభలో భారత రాష్ట్ర సమితి నాయకులను విమర్శించారు. అయితే నాడు అప్పును తప్పు అని చెప్పిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.. ఇప్పుడు అదే అప్పును తెలంగాణ అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నామని చెప్పడం విశేషం.. అంతేకాదు భారత రాష్ట్ర సమితి చేసిన అప్పులను తాము తీర్చుతున్నామంటూ వివరించడం గమనార్హం. అటు భారత రాష్ట్ర సమితి కూడా కాంగ్రెస్ పార్టీ - మిగతా3లో





## ఎన్నికల సంఘం ప్రెస్ మీట్

- రాహుల్‌గాంధీ ఆరోపణలకు సమాధానం ఇచ్చే ఛాన్స్..!
- ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నేషనల్ మీడియా సెంటర్‌లో ప్రెస్‌మీట్
- అదేవిధంగా తాజా రాజకీయ పరిణామాలపై కూడా ఈసీ బ్రీఫింగ్ ఇవ్వనుంది



## బిహార్‌లో స్పెషల్ ఇంటెన్స్ రివిజన్..

- రాహుల్ గాంధీ ఓటు అధికార్ యాత్ర..!
- రాహుల్ 16 రోజుల పాటు 24 జిల్లాల్లోని 118 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటన
- రూ.1,300 కిలోమీటర్ల పొడవైన 16 రోజుల ప్రయాణం బీహార్‌లోని దాదాపు 25 జిల్లాల గుండా సాగనున్నది.

# అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



- లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- చెరువులు, రిజర్వాయర్లు, కుంటల దగ్గర ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలి
- ఆ ప్రాంతాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించాలి
- ప్రజల వినతులపై తక్షణమే స్పందించాలి
- అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి
- ప్రధానంగా హైదరాబాద్‌లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

హైదరాబాద్

తెలంగాణలో భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలిని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వర్ష ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ? బృందాలను తరలించాలని ముందుగా ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, చెరువులు, రిజర్వాయర్లు, కుంటల దగ్గర ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రజల వినతులపై తక్షణమే స్పందించాలన్నారు సీఎం రేవంత్. ఇదిలా ఉంచితే, తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. దీనిలో భాగంగా భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి. ఇక ఆదిలాబాద్, కొమురం భీం, జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లా, వరంగల్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. వాగులు పొంగే ప్రమాదమున్న జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముంపు ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. “జలాశయాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలి. నీటి విడుదలపై కలెక్టర్లు క్షేత్రస్థాయి సిబ్బందికి ముందస్తు సమాచారం ఇవ్వాలి. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలి. నగర, పురపాలక, గ్రామాల పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. వైద్యారోగ్య శాఖ - మిగతా3లో



## వాజపేయి నాయకత్వంలో ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచిన భారత్

- బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు
- వాజపేయి ఒకసారి 13 రోజులు.. మరోసారి 13 నెలలు,
- తర్వాత నాలుగున్నర సంవత్సరాలు ప్రధానమంత్రిగా పనిచేశారు
- ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచింది
- ఆర్థికంగా కూడా దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆయన పాలన ఒక నిదర్శనం.

## ట్రంప్- పుతిన్ ప్రయత్నాలు భేష్..

- ‘అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధినేత పుతిన్ ల మధ్య అలాస్కాలో జరిగిన సమావేశాన్ని స్వాగతిస్తున్నాం
- శాంతి సాధన దిశగా వారి ప్రయత్నాలు ఎంతో ప్రశంసనీయం
- ఈ భేటీలో సాధించిన పురోగతిని అభినందిస్తున్నాం
- చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే సమస్య పరిష్కారానికి ముందుకెళ్లాలి



## పోలవరం కాఫర్ డ్యామ్.. రెండోసారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించడం లేదా?

- కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే కూళేశ్వరం అని కారుకూతలు కూసిన కాంగ్రెస్, బీజేపీ నేతలకు “పోలవరంను.. కూలవరం” అనే దమ్ము ధైర్యం ఉందా..?
- తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా..?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్

జాతీయ హోదా ఇచ్చి మరీ.. సాక్షాత్తూ ఎన్డీఏ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం కాఫర్ డ్యామ్, రెండో సారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించడం లేదా..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళు వస్తే కూలేశ్వరం అని కారుకూతలు కూసిన కాంగ్రెస్, బీజేపీ నేతలకు “పోలవరంను.. కూలవరం” అనే దమ్ము ధైర్యం ఉందా..? అని అడిగారు. - మిగతా3లో

# ట్రంప్- పుతిన్ ప్రయత్నాలు భేష్

**ఇంటర్నెట్ డెస్క్:** ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే ప్రయత్నాల్లో భాగంగా అలాస్కా వేదికగా అమెరికా, రష్యా అధ్యక్షుల మధ్య జరిగిన సమావేశాన్ని భారత్ స్వాగతించింది. ఈ భేటీలో భాగంగా సాధించిన పురోగతిని అభినందిస్తున్నట్లు పేర్కొంది. భారత విదేశాంగశాఖ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధినేత పుతిన్ ల మధ్య అలాస్కాలో జరిగిన సమావేశాన్ని స్వాగతిస్తున్నాం. శాంతి సాధన దిశగా వారి ప్రయత్నాలు ఎంతో ప్రశంసనీయం. ఈ భేటీలో సాధించిన పురోగతిని అభినందిస్తున్నాం. చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే సమస్య పరిష్కారానికి ముందుకెళ్లాలి. ఉక్రెయిన్ సంక్షోభానికి వీలైనంత త్వరగా తెరపడాలని ప్రపంచం కోరుకుంటోంది" అని విదేశాంగశాఖ తన ప్రకటనలో పేర్కొంది. ట్రంప్, పుతిన్‌లు భేటీ అయ్యేందుకు ముందుకు రావడాన్ని కూడా భారత్ ఇటీవల స్వాగతించిన విషయం తెలిసిందే. "ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలికేందుకు ఇదో అవకాశంగా భావిస్తున్నాం. ఇది యుద్ధాల కాలం కాదన్న ప్రధాని నరేంద్ర మోదీ సందేశానికి ఈ ప్రయత్నాలు దోహదం చేస్తాయి" అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ




ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, అమెరికాలోని అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య జరిగిన కీలక భేటీ ముగిసింది. భారత కాలమాన ప్రకారం శుక్రవారం(ఆగస్టు 15వ తేదీ) అర్ధరాత్రి గం. 12.30 ని.లు దాటాకా ఇరువురి అధ్యక్షుల మధ్య దాదాపు మూడు గంటల పాటు సాగిన ఈ భేటీ.. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి ఎలాంటి ఒప్పందం కుదరకుండానే ముగిసిపోయింది వీరి భేటీపై ప్రపంచ దేశాలన్నీ ఉత్కంఠగా ఎదురుచూసినప్పటికీ అనుకున్న ఫలితం మాత్రం దక్కలేదు. అయితే, వీరి మధ్య మరో సమావేశం రష్యాలో జరగనుందని పుతిన్ చివరలో ట్విస్ట్ ఇచ్చారు. కీలక సమావేశం అనంతరం ఇద్దరు నేతలు భేటీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. సమావేశంలో అనేక విషయాలు చర్చకు వచ్చాయి. కానీ, యుద్ధానికి సంబంధించిన తుది ఒప్పందం మాత్రం కుదరలేదన్నారు. ఈ చర్చల్లో ఎంతో పురోగతి ఉందన్నారు. అయితే కొన్ని సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉందని వెల్లడించారు. చాలా అంశాలను ఇద్దరం అంగీకరించాం. అయితే, కొన్ని ఇంకా మిగిలే ఉన్నాయన్నారు. అన్ని విషయాలను పరిష్కరించుకొని అధికారికంగా అగ్రిమెంట్‌పై సంతకం చేసే వరకు ఒప్పందం కుదరనట్టే అవుతుంది. త్వరలో తాను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, యురోపియన్ యూనియన్ నేతలతో మాట్లాడతానని ట్రంప్ తెలిపారు. తాను మళ్లీ పుతిన్‌ను కలుస్తానని చెప్పుకొచ్చారు. మరొకవైపు ఒప్పందం చేసుకోవాలని జెలెన్‌స్కీకి సూచిస్తానని ట్రంప్ తెలిపారు. కానీ ఏం జరుగుతుందో తెలియదన్నారు. 'రష్యా చాలా శక్తిమంతమైన దేశం. పుతిన్-జెలెన్‌స్కీల సమావేశం జరుగుతుందని ఆశిస్తున్నా. అందులో నేను కూడా చేరే అవకాశం ఉందన్నారు ట్రంప్.

# ట్రంప్ నిర్ణయంపై డెమోక్రాటిక్ ప్యానల్ విమర్శ

**న్యూయార్క్ :** రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్న విషయంలో అమెరికాలో రాజకీయ వేడి రాజుకుంది. భారత్‌పై 50 శాతం మేర భారీ సుంకాలు (టారిఫ్‌లు) విధించాలన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాన్ని... డెమొక్రాటిక్ పార్టీ విదేశీ వ్యవహారాల కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇలాంటి చర్యల వల్ల రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను నిలువరించలేమని, ఉక్రెయిన్ పై పుతిన్ పై దాడిని ఆపలేమని స్పష్టం చేసింది."భారత్‌పై సుంకాలు విధించడం వల్ల పుతిన్ ఆగిపోరు. ట్రంప్ నిజంగా రష్యా దురాక్రమణను అడ్డుకోవాలని అనుకుంటే పుతిన్‌ను శిక్షించాలి. ఉక్రెయిన్‌కు అవసరమైన సైనిక సహాయాన్ని అందించాలి. మిగతావన్నీ కేవలం కంటితుడుపు చర్యలే అవుతాయి" అని హౌస్ ఫారెన్ అఫైర్స్ కమిటీకి చెందిన డెమొక్రాటిక్ ప్యానెల్ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలు వెలువడటానికి ముందు, అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ భారత్‌కు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగిస్తే ద్వితీయ శ్రేణి సుంకాలను మరింత పెంచే అవకాశం ఉందని ఆయన బ్లూమ్‌బర్గ్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. అలాస్కాలో ట్రంప్, పుతిన్‌ల మధ్య ముగిసిన చర్చలు ఫలించకపోతే తదుపరి చర్యలు తీవ్రంగా ఉండొచ్చని ఆయన అన్నారు."రష్యా చమురు కొంటున్నందుకు భారతీయులపై మేం ఇప్పటికే ద్వితీయ శ్రేణి సుంకాలను విధించాం. పరిస్థితులు అనుకూలంగా లేకపోతే, ఈ ఆంక్షలు లేదా సుంకాలను మరింత పెంచే అవకాశాలు ఉన్నాయి" అని బెస్సెంట్ వివరించారు. రష్యా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్నది చైనా కదా అని ప్రశ్నించగా...



"అధ్యక్షుడు ట్రంప్ తనకు అనుకూలంగా పరిస్థితులను మార్చుకోవడంలో దిట్ట. అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను పుతిన్ ముందు ట్రంప్ ఉంచారు" అని బెస్సెంట్ పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో డెమొక్రాటిక్ ప్యానల్ కీలక వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

**డోనాల్డ్ ట్రంప్ తో ఉక్రెయిన్ అధ్యక్షుడు భేటీ**

ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా దౌత్యపరమైన ప్రయత్నాలు ఒక్కసారిగా వేగవంతమయ్యాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అమెరికాలోని అలాస్కాలో చర్చలు జరిపిన కొద్ది గంటలకే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీతో ఆయన శనివారం ఫోన్‌లో సుదీర్ఘంగా మాట్లాడారు. అనంతరం, సోమవారం వాషింగ్టన్‌లో వ్యక్తిగతంగా సమావేశం కావాలని జెలెన్‌స్కీని ఆహ్వానించారు. ఈ భేటీలో యుద్ధ నివారణ, హింసకు ముగింపు పలికే అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. ఈ విషయాన్ని జెలెన్‌స్కీ స్వయంగా సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. "అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సుదీర్ఘంగా, ఫలప్రదంగా చర్చలు జరిపాం. శాంతిని నెలకొల్పేందుకు గరిష్ఠ స్థాయిలో కృషి చేయడానికి ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించాం. రష్యా నేతతో జరిగిన సమావేశం, చర్చకు వచ్చిన ప్రధాన అంశాలను ట్రంప్ నాకు వివరించారు" అని జెలెన్‌స్కీ తెలిపారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో అమెరికా సానుకూల ప్రభావం చూపడం చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా, అమెరికా, రష్యా, ఉక్రెయిన్ మధ్య త్రైపాక్షిక సమావేశం నిర్వహించాలన్న ట్రంప్ ప్రతిపాదనకు తాము మద్దతు ఇస్తున్నట్లు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. కీలకమైన సమస్యలను నేతల స్థాయిలో చర్చించడం ద్వారానే పరిష్కరించగలమని, అందుకు ఈ ఫార్మాట్ సరైనదని ఉక్రెయిన్ భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. "సోమవారం వాషింగ్టన్‌లో ట్రంప్‌తో భేటీ అయి అన్ని వివరాలపై చర్చిస్తాను. ఈ ఆహ్వానానికి నేను కృతజ్ఞుడను" అని ఆయన తన పోస్టులో రాసుకొచ్చారు. మరోవైపు, అలాస్కాలో పుతిన్‌తో జరిగిన ట్రంప్ సమావేశంలో చర్చలు ముందుకు సాగినప్పటికీ, ఎలాంటి కచ్చితమైన ఒప్పందం కుదరలేదని వైట్ హౌస్ వర్గాలు తెలిపాయి. చర్చల అనంతరం పుతిన్ మాట్లాడుతూ, ఉక్రెయిన్‌పై ఇరు నేతల మధ్య ఒక అవగాహన కుదిరిందని పేర్కొన్నారు. అయితే, ట్రంప్ దీనిపై స్పందిస్తూ, "ఒక ఒప్పందం కుదిరే వరకు ఎలాంటి అంగీకారం లేదు" అని స్పష్టం చేశారు. సంక్షోభానికి మూలకారణాలను తొలగిస్తేనే శాంతి సాధ్యమని పుతిన్ అన్నారు. దాదాపు దశాబ్దం తర్వాత ఒక రష్యా అధ్యక్షుడు అమెరికాలో పర్యటించడం ఇదే తొలిసారి.

# మీకో, మీ మంత్రికో, మీ ఎమ్మెల్యేకో జరిగితే ఇలాగే చేస్తారా?

జమ్ము కశ్మీర్ కిష్తవాడ్ జిల్లా చోసితీ గ్రామంలో ఫ్లాష్‌ఫ్లడ్ సహాయక చర్యలు మూడో రోజుకి చేరాయి. ఇప్పటిదాకా 60 మంది మరణించగా.. గల్లంతైన 80 మంది కోసం(ఆ సంఖ్యే ఎక్కువే ఉండొచ్చని తెలుస్తోంది) గాలింపు కొనసాగుతోందని అధికారులు ప్రకటించారు. అదే సమయంలో స్థానికుల ఆగ్రహమూ తారాస్థాయికి చేరింది. అందుకు అక్కడి ప్రజాప్రతినిధులు తీరే కారణంగా తెలుస్తోంది. గురువారం మధ్యాహ్నం క్లౌడ్‌బరస్ట్ కారణంగా మెరుపు వరదలు చోసితీని ముంచెత్తాయి. బురద నుంచి శకలాలను తొలగిస్తున్న కొద్దీ.. మృతదేహాలు బయటపడుతూ వస్తున్నాయి. దీంతో గల్లంతైన వాళ్ల కుటుంబ సభ్యుల్లో ఆందోళన పెరిగిపోతోంది. ఈ క్రమంలో.. జమ్ము కశ్మీర్ ఒమర్ అబ్దుల్లా శనివారం ఆ ప్రాంతంలో పర్యటించగా.. స్థానికుడి నుంచి ఆయనకు నిలదీత ఎదురైంది. "పోలీసులు, సైన్యం మా వాళ్ల జాడ కోసం అహర్నిశలు ఇక్కడ కష్టపడుతున్నారు. మేమూ మాకు చేతనైన ప్రయత్నాలు చేస్తున్నాం. ఇక్కడ 20 జేసీబీలు ఉన్నాయి.కానీ, ఇందులో రెండే పని చేస్తున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు పదే పదే ఇక్కడికి వస్తున్నారు. ఫొటోలకు ఫోజులిస్తున్నారు. దీంతో సహాయక చర్యలు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. గత మూడురోజుల్లో ఇక్కడ రెండే రెండు పెద్ద బండరాళ్లను తొలగించారంటే పరిస్థితి అర్థం చేసుకోండి. మాకు కుటుంబాలు లేవా?. కనీసం మా వాళ్ల శవాలనైనా మాకు అప్పగించండి" అని ఎన్డీటీవీతో బాధితుడొకరు తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. సరిగ్గా అదే సమయంలో సీఎం ఒమర్ అబ్దుల్లా అటుగా వచ్చారు. ఏం జరిగిందో చెప్పమంటూ ఆ వ్యక్తిని ఆరా తీశారు. జరిగిందంతా చెప్పి.. కనీసం తమవాళ్ల మృతదేహాలనైనా అప్పగించాలని కోరాడా వ్యక్తి. జరుగుతోంది అదేనని.. ఘటన జరిగిన నాటి సహాయక





చర్యలు కొనసాగుతున్నాయని ఆ వ్యక్తికి సీఎం బదులిచ్చారు. ఈ క్రమంలో.. అతను మరోసారి తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. "సర్.. నేను చెప్పేది ఓసారి వినండి. నా కుటుంబం నుంచి 13 మంది జాడ లేకుండా పోయారు(తమ పిల్లల ఆచూకీ లేదంటూ పలువురు ఆ సమయంలో గట్టిగా రోదించారు). ఎమ్మెల్యేలు, మంత్రులు పది పదిసార్లు ఇక్కడికి వస్తున్నారు. జేసీబీలను ఆపేయించి ఫొటోలు దిగుతున్నారు. మేం నిస్సహాయంగా చూస్తూ ఉండిపోతున్నాం" అని వివరించాడు. విషాదంతో చాలా కుటుంబాలు బాధపడుతున్నాయని, అది తాను అర్థం చేసుకోగలనని సీఎం ఫరూక్ అబ్దుల్లా అన్నారు. దీంతో ఆ యువకుడు.. మీకో, మీ ఎమ్మెల్యేకో, మీ మంత్రికో జరిగితే ఇలాగే చేస్తారా?.. త్వరగతిన చర్యలు తీసుకుంటారు కదా అని నిలదీశాడా వ్యక్తి. దీంతో అధికారులను పిలిపించిన సీఎం ఫరూక్ అబ్దుల్లా.. సహాయక చర్యలు త్వరగతిన జరిగేలా చూడాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

## ఉడుపిలో భక్తులు శ్రీకృష్ణాష్టమి వేడుకల కోసం నెల రోజులు వేచిచూడాల్సిందే.. ఎందుకంటే..!

ఉడుపిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రతి ఏటా ఘనంగా జరుగుతాయి. శ్రీకృష్ణ మఠం వారు నిర్వహించే ఈ వేడుకలను చూసేందుకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అయితే ఈ ఏడాది ఉడుపిలో జన్మాష్టమి వేడుకలు నెల ఆలస్యంగా జరగనున్నాయి. సాధారణంగా దేశమంతటా కృష్ణాష్టమి వేడుకల కోసం చాంద్రమాన క్యాలెండర్‌ను అనుసరిస్తారు. కానీ ఉడుపిలో శ్రీకృష్ణ మఠం వారు మాత్రం సూర్యమాన క్యాలెండర్‌ను అనుసరిస్తూ వస్తున్నారు. సూర్యమాన క్యాలెండర్ ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్ 14న రోహిణీ నక్షత్రం అష్టిమి తిథితో కలువనుంది. శ్రీకృష్ణ మఠం వారు అదేరోజు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ఆర్ఘ్య ప్రధానం లాంటి ప్రతీకాత్మక క్రతువులను మాత్రం ఇవాళ జరిపించారు. దాంతో ఇవాళ ఉడుపికి చేరుకున్న భక్తులు, పూలు అమ్ముకోవడం వచ్చిన వ్యాపారులు నిరుత్సాహానికి గురయ్యారు. వేడుకలు చూస్తామని వచ్చిన భక్తులు.. అసలైన వేడుకలు వచ్చే నెల 14న జరుగుతాయని తెలుసుకుని నిరుత్సాహానికి గురయ్యారు. పూల వ్యాపారులు అమ్ముడుపోని పూలతో దిగాలుగా కనిపించారు. అంటే వేడుకల వాయిదావల్ల కేవలం భక్తులే కాకుండా అక్కడి చిరు వ్యాపారులు కూడా ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. అయితే వచ్చే నెల 14న జరిగే వేడుకలు తమ నష్టాన్ని పూడుస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## ఎన్నికల సంఘం ప్రెస్ మీట్




కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం ప్రెస్ మీట్ నిర్వహించనుంది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు దేశ రాజధాని ఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో ఈ ప్రెస్‌మీట్ జరగనుంది. ఎన్నికల సంఘం అధికార బీజేపీకి అనుకూలంగా ఓట్ల చోరీకి పాల్పడుతున్నదని ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఈసీ ప్రెస్ మీట్ నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రెస్‌మీట్‌లో రాహుల్‌గాంధీ ఆరోపణలకు ఈసీ సమాధానం ఇచ్చే అవకాశం ఉంది. అదేవిధంగా తాజా రాజకీయ పరిణామాలపై కూడా ఈసీ బ్రీఫింగ్ ఇవ్వనుంది. కాగా బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ అక్కడ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ఓటర్ల జాబితాను సవరించింది. దీనిపై కాంగ్రెస్ సహా విపక్షాలన్ని విమర్శలు గుప్పిస్తున్నాయి. ఏ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల జరిగినా అక్కడ అధికార బీజేపీకి తోడ్పడేలా ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాల్లో అవకతవకలకు పాల్పడుతోందని ఆరోపిస్తున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక, హర్యానా ఎన్నికల సందర్భంగా కూడా ఈసీ ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడిందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. తాజాగా బీహార్లో కూడా అదే పనిచేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఈసీ ప్రెస్ మీట్ నిర్వహిస్తుండటం ఆసక్తికరంగా మారింది.

## బిహార్‌లో స్పెషల్ ఇంటెన్స్ రివిజన్



బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నేపథ్యంలో కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ నెల 17 నుంచి బిహార్‌లో ఓటు అధికార్ యాత్ర చేపట్టనున్నారు. రాహుల్ 16 రోజుల పాటు 24 జిల్లాల్లోని 118 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటన కొనసాగుతుందని ఎంపీ అఖిలేష్ సింగ్ తెలిపారు. ఈ మేరకు అన్ని సన్నాహాలను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. రూ.1,300 కిలోమీటర్ల పొడవైన 16 రోజుల ప్రయాణం బీహార్‌లోని దాదాపు 25 జిల్లాల గుండా సాగనున్నది. అఖిల భారత కూటమిలోని అన్ని పార్టీల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు. బిహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ సైతం రాహుల్‌తో కలిసి యాత్రలో పాల్గొంటారు. రాహుల్ గాంధీ దేశంలో ఓటును బలోపేతం చేయడానికి బయలుదేరారని కాంగ్రెస్ ఇన్‌చార్జి కృష్ణ తెలిపారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటర్లను బలోపేతం చేయడానికి రాహుల్ గాంధీ ఓటర్ల హక్కుల యాత్రను చేపడుతున్నారు. ఆయన ప్రజా కోర్టుకు చేరుకుని, భారత రాజ్యాంగాన్ని బలోపేతం చేయాలంటే, ఇక్కడి ఓటర్లను బలోపేతం చేయాలని ప్రజలకు చెబుతారు. బీహార్‌లో ఓటర్ల జాబితాలో సవరణకు వ్యతిరేకంగా, ఓటర్ల చోరీకి వ్యతిరేకంగా పోరాటం ఒక ప్రజా ఉద్యమంగా మార్చడానికి యాత్ర జరుగుతోందని ఆయన అన్నారు. యాత్ర రోహ్తాస్ నుంచి మొదలై.. సెప్టెంబర్ ఒకటిన పాట్నాకు చేరుకుంటుందని వివరించారు.

## కోటి ఉద్యోగాలు.. పరిశ్రమలకు ఉచిత భూములు.. నితీష్ ఎన్నికల హామీలివే..



**పట్నా:** బీహార్‌లో ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం నితీష్ కుమార్ పలు ఎన్నికల హామీలను గుప్పించారు. తమ ప్రభుత్వం రాబోయే ఐదేళ్లలో యువతకు కోటి ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు. 2020లో 'సాత్ నిశ్చయ్-2' కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రభుత్వ ఉద్యోగాలు, ఇతర ఉపాధి మార్గాల ద్వారా ప్రభుత్వం ఇప్పటికే 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించిందని సిఎం వివరించారు. సీఎం నితీష్ కుమార్ తన 'ఎక్స్' ఖాతాలో తమ ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాలను తెలియజేశారు. తమ ప్రభుత్వం కొత్త వ్యాపారాలకు ప్రోత్సాహకాలను అందిస్తుందని, బీహార్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే వ్యవస్థాపకులకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని అందిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం రాబోయే ఐదేళ్లలో కోటి మంది యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. బీహార్‌లో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు సీఎం నితీష్ కుమార్ చేసిన ప్రధాన హామీలివే..

**ప్రోత్సాహకాలు రెట్టింపు**

మూలధన సబ్సిడీ, వడ్డీ సబ్సిడీ, జీఎస్టీ రీయంబర్స్‌మెంట్ కోసం అందించిన మొత్తాన్ని రెట్టింపు చేయడం.

**పరిశ్రమలకు భూమి**

పరిశ్రమల స్థాపన కోసం ప్రతి జిల్లాలో భూమిని కేటాయించనున్నారు.

**ఉపాధికి ఉచిత భూమి**

అధికంగా ఉపాధిని కల్పించే పరిశ్రమలకు ఉచితంగా భూమి ఇవ్వనున్నారు.

**భూ వివాదాల పరిష్కారం**

పరిశ్రమల కోసం కేటాయించిన భూమికి సంబంధించిన ఏవైనా వివాదాలు వెంటనే పరిష్కరించనున్నారు.

**కాలపరిమితి ప్రయోజనాలు**

ఈ ప్రయోజనాలు రాబోయే ఆరు నెలల్లో పరిశ్రమలను స్థాపించే వ్యవస్థాపకులకు అందనున్నాయి.

# 3 పార్టీలకు పరీక్షే

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అన్ని పార్టీల మధ్య కాక రేపుతుంది. నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా అన్ని పార్టీలు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటి నుంచే అస్త్ర శస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచి సత్తా చాటుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. ఉప ఎన్నికల్లో గెలిచి తమ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం చెక్కు చెదరలేదని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుంది. అదే సమయంలో ప్రభుత్వంపై రెండేళ్లలోనే అసంతృప్తి పెరిగిందని, అందుకు ఉప ఎన్నికల్లో గెలిచి నిరూపించాలని బీఆర్ఎస్ పార్టీ తహతహలాడుతుంది. మరొకవైపు బీజేపీ కూడా తాము రేసులో ఉన్నామని, ఈ సారి అధికార పీఠం తమదేనని తేల్చి చెప్పేందుకు ఈ ఎన్నికను రెఫరెండంగా చూడాలని కమలనాథులు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఇప్పటికే అభ్యర్థి విషయంలో స్పష్టత ఇచ్చింది. లోకల్స్ ను మాత్రమే అభ్యర్థిగా ఎంపిక చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగంగానే ప్రకటించారు. అంటే ఇతర నియోజకవర్గాలకు చెందిన నేతలు ఇక్కడ పోటీ చేయాలన్న ఆశలు పెట్టుకోవద్దని కూడా సున్నితంగా తెలిపినట్లయింది. అయితే గత ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ తీవ్రంగానే ఢిల్లీలో తనకున్న లాబీయింగ్ తో ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అజారుద్దీన్ ను అభ్యర్థిగా ఎంపిక చేయడం స్థానిక రాష్ట్ర నాయకత్వానికి ఇష్టం లేనట్లు కనిపిస్తుంది. అజారుద్దీన్ ప్రజలకు అందుబాటులో ఉండే నేత కాదని, అందుకే ప్రత్యామ్నాయం వైపు హస్తం పార్టీ చూస్తున్నట్లు సమాచారం. మరి హైకమాండ్ నిర్ణయం ఎలా ఉంటుందన్నది చూడాలి.. మరొక వైపు బీఆర్ఎస్ పార్టీ ఖచ్చితంగా ఈ స్థానాన్ని సొంతం చేసుకోవాలని భావిస్తుంది. తమ సిట్టింగ్ స్థానం కావడంతో తిరిగి నిలుపుకుని కేసీఆర్ కు ఉన్న ఇమేజ్ ఏమాత్రం తగ్గలేదని, అదే సమయంలో రేవంత్ సర్కార్ పై వ్యతిరేకత ప్రారంభమయిందని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నేతల్లోనూ, క్యాడర్ లోనూ జోష్ నింపాలంటే ఈ



ఎన్నికలో గెలవడం ముఖ్యమని భావిస్తుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు కూడా ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ లో కీలక నేతలతో భేటీ అయ్యారు. కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్వర్ రెడ్డి తదితరులతో జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికపై ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. అయితే ఇద్దరు ముగ్గురు అభ్యర్థుల పేర్లను కేసీఆర్ పరిశీలిస్తున్నారని, సర్వేచేయించిన అనంతరం వారిలో ఒకరికి కేటాయిస్తారని అంటున్నారు. ఇక బీజేపీ కూడా జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికపై నమ్మకం పెట్టుకుంది. ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఓటుబ్యాంకుతో పాటు సినీ ప్రముఖులు ఎక్కువగా ఉండటం తమకు కలసి వచ్చే అంశంగా భావిస్తుంది. అయితే టీడీపీతో పొత్తుకు మాత్రం బీజేపీ సిద్ధపడటం లేదు. టీడీపీ, జనసేనల నుంచి లోపాయికారీ పొత్తును కుదుర్చుకుని బరిలోకి దిగి గెలవాలని బీజేపీ కూడా వ్యూహాలు రచిస్తుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక టిక్కెట్ కోసం అనేక మంది నేతలు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇది కూడా ఢిల్లీ స్థాయిలో తేలాల్సిన అంశం కావడంతో కొందరు కేంద్రమంత్రులు బండి సంజయ్ ద్వారా, మరికొందరు కిషన్ రెడ్డి ద్వారా, ఇంకొందరు రాజ్యసభ్యుడు కె.లక్ష్మణ్ ద్వారా లాబీయింగ్ మొదలుపెట్టినట్లు తెలిసింది. మొత్తం మీద జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక మూడు పార్టీల్లో హీట్ రేపుతుందని చెప్పాలి.

# ములుగు జిల్లాకు ఐటీ కంపెనీ

**వరంగల్ :** ములుగును ఐటీ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. రూ.6 కోట్లతో ఐదు అంతస్తుల అత్యాధునిక ఐటీ భవనాన్ని నిర్మించనున్నారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా టాస్క్ సెంటర్‌లో ఐటీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే సిరి ఇన్ఫోటెక్ అనే కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని కార్యకలాపాలు ప్రారంభించారు. దీని ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో ఐటీ విప్లవం సృష్టించి వేల సంఖ్యలో ఉద్యోగాలను కల్పించాలని ప్రభుత్వం కృషి చేస్తోంది. తెలంగాణలోని వెనుకబడిన మన్యం జిల్లా ములుగును భవిష్యత్తులో ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. స్థానిక యువతకు ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. జిల్లాలో పెద్ద ఐటీ కంపెనీలను ఆకర్షించేలా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ములుగు పట్టణ శివారులో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.6 కోట్లతో అత్యాధునిక ఐటీ భవనం నిర్మించనున్నారు. ఈ ఐదు అంతస్తుల భవనం కోసం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు ప్రతిపాదనలు పంపించారు. ఒక్కో అంతస్తులో ఒక్కో ఐటీ కంపెనీని ఏర్పాటు చేసి, వేల సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ఉన్న తరహాలోనే ఈ భవనంలో అన్ని రకాల వసతులు కల్పించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల మంజూరు కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు, ములుగులో ఇప్పటికే ఏర్పాటు చేసిన టాస్క్ ) సెంటర్‌లో యువతకు ఐటీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఐటీ



కంపెనీల ప్రాజెక్టులకు అనుగుణంగా ఉండే కోర్సులపై దృష్టి సారించి యువతను సిద్ధం చేస్తున్నారు. శిక్షణ పూర్తి అయిన వెంటనే ఇక్కడే ఉద్యోగాలు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఐటీ కంపెనీలను ఆకర్షించే దిశగా తొలి అడుగు పడింది. ములుగులోని టాస్క్ సెంటర్ ఆవరణలో సిరి ఇన్ఫోటెక్ అనే కంపెనీతో ఒప్పందం చేసుకుని నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో ఉద్యోగులు, మేనేజర్ల గదులు, వెయిటింగ్ హాల్ వంటి సౌకర్యాలు కార్పొరేట్ స్థాయిలో కల్పించారు. త్వరలోనే మంత్రి సీతక్క చేతుల మీదుగా ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భవిష్యత్తులో ఈ కంపెనీ సేవలు మరింత విస్తరించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏజెన్సీ ప్రాంతమైన ములుగులో ఐటీ విప్లవం సృష్టించి చరిత్ర సృష్టించాలని ములుగు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది.

## 20 నెలలు.. 20వేల కోట్లు నెలకు 1000 కోట్ల అప్పు

-మొదటిపేజీ తరువాయి

చేసిన అప్పులపై అనేక సందర్భాలలో.. వివిధ వేదికలపై విమర్శలు చేస్తోంది. తాజాగా ఓ ప్రైవేట్ న్యూస్ ఛానల్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అప్పుల గురించి ఒక సెటైరికల్ వీడియో రూపొందించింది. ఆ వీడియోను భారత రాష్ట్ర సమితి ఐటి విభాగంలో పనిచేసే ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దానిని భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రీ ట్వీట్ చేశారు.. కాంగ్రెస్ పార్టీ పెద్దల మీద ఒక్క మాట కూడా మాట్లాడకుండానే.. ఈ వీడియో ద్వారా తన మనసులో ఉన్న మాటను మరోసారి కేటీఆర్ బయట పెట్టారు. ,"భారత రాష్ట్ర సమితి అంత గొప్పగా తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తే.. ఉద్యోగులకు ఏరియర్స్ ఎందుకు చెల్లించలేదు.. కాంట్రాక్టర్లకు బిల్లులు ఎందుకు చెల్లించలేదు.. ఆరోగ్యశ్రీ బకాయిలు ఎందుకు అంతలా పెరిగిపోయాయి.. చివరికి ఔటర్ రింగ్ రోడ్డు ను కూడా తాకట్టు పెట్టారు కదా.. భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు ఆర్థిక క్రమశిక్షణ అంత గొప్పగా ఉంటే ఇవన్నీ ఎందుకు జరిగాయని" కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌంటర్ ఇస్తున్నారు.

# మెత్తబడుతున్న కవిత

**హైదరాబాద్ :** కొద్దిరోజులుగా భారత రాష్ట్ర సమితి శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత సొంత పార్టీలో కొంతమంది నాయకులపై యుద్ధం ప్రకటించారు. ఆ యుద్ధాన్ని అలాగే కొనసాగిస్తున్నారు. తన తండ్రిని దేవుడు అంటూనే.. తనను ఇబ్బంది పెడుతున్న నాయకులను దయ్యాలు అని కల్వకుంట్ల కవిత ఆరోపిస్తున్నారు. సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ తనదైన శైలిలో విమర్శలు చేస్తున్నారు. వాస్తవానికి కల్వకుంట్ల కవిత స్థానంలో మరొక నాయకుడు ఉంటే కేసీఆర్ ఇప్పటికే తన పార్టీ నుంచి బయటికి పంపించేవారు. కల్వకుంట్ల కవిత ఆయన కుమార్తె కాబట్టి నిశ్శబ్దంగా ఉంటున్నారు. కల్వకుంట్ల కవిత కూడా భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూనే.. తన మానస పుత్రిక జాగృతిని బలోపేతం చేస్తున్నారు. జాగృతి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. గత పది సంవత్సరాలుగా జాగృతి విషయంలో అంతగా సీరియస్ నెస్ చూపించని కవిత.. కొద్దిరోజులుగా జాగృతిని బలోపేతం చేస్తున్నారు. జిల్లాలకు కమిటీలు ఏర్పాటు చేశారు. సింగరేణి కార్మిక సంఘం నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఒక రకంగా తెలంగాణ అప్పటి పరిస్థితులను ఆమె చూపిస్తున్నారు. భారత రాష్ట్ర సమితిలో తన తండ్రిని దేవుడు అని వ్యాఖ్యానించిన ఆమె.. కొంతమంది నాయకులను దయ్యాలు అని ఆరోపిస్తున్నారు. అంతేకాదు ఒక నాయకుడిని ఉద్దేశించి ఇటీవల లిల్లీపుట్ అని కూడా ఆరోపించారు. అయితే అటువంటి కవిత ఇప్పుడు సొంత పార్టీ లోకి వెళ్తున్నారా.. త్వరలో దానికి ముహూర్తం ఖరారయిందా.. ఈ ప్రశ్నలకు అవును అనే సమాధానం చెబుతున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రతి జిల్లాలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఒక సర్కులర్ విడుదల చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ కలవకుండా కవిత తన సామాజిక మాధ్యమ వేదికలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ తెలంగాణ తల్లి విగ్రహాలను ఆమోదించేది లేదని పేర్కొన్నారు. అదే కాదు ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ తల్లి విగ్రహాలు ఎక్కువ రోజులు నిలబడవని కవిత స్పష్టం చేశారు. వచ్చే రోజుల్లో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ విగ్రహాలను సకల మర్యాదలతో గాంధీభవన్ కు పంపిస్తామని కవిత ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది. ఎందుకంటే భారత రాష్ట్ర సమితి తిరిగే అధికారంలోకి వస్తే అనే పదాన్ని వాడారు కాబట్టి కవిత.. తిరిగి సొంత పార్టీలోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కెసిఆర్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడం వల్లే కవిత ఆ వ్యాఖ్యలు చేశారని సమాచారం. ఇటీవల రాఖీ పండుగ సందర్భంగా కేటీఆర్ కు కవిత రాఖీ కట్టని విషయం తెలిసిందే. పైగా కేటీఆర్ భారత రాష్ట్ర సమితికి కార్య నిర్వాహక అధ్యక్షుడిగా ఉన్నారు.

## అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

అధికారులు అవసరమైన ఔషధాలు సిద్ధంగా ఉంచుకోవాలి. అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రధానంగా హైదరాబాద్‌లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి. జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ తక్షణమే స్పందించాలి" అని సీఎం ఆదేశించారు.

## వాజపేయి నాయకత్వంలో ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచిన భారత్

**హైదరాబాద్ :** అటల్ బిహారీ వాజపేయి పుణ్యతిథి సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు వాజపేయి గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వాజ్ పేయి విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు , రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రా రెడ్డి , రాష్ట్ర కార్యదర్శులు డా. ఎస్. ప్రకాష్ రెడ్డి , మాధవి , సీనియర్ నాయకుడు మర్రి శశిధర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ అటల్ బిహారీ వాజపేయి ఒకసారి 13 రోజులు, మరోసారి 13 నెలలు, తర్వాత నాలుగున్నర సంవత్సరాలు ప్రధానమంత్రిగా పనిచేశారు. ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచింది. ఆర్థికంగా కూడా దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆయన పాలన ఒక నిదర్శనం. గ్రామీణ సడక్ యోజన, ప్రధానమంత్రి స్వర్ణ చతుర్భుజ ప్రాజెక్ట్ ద్వారా జాతీయ రహదారులు, ఎయిర్‌పోర్టులు వంటి అనేక మౌలిక వసతుల నిర్మాణాలు జరిగాయి. పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించిన సమయంలో ప్రపంచంలోని అనేక దేశాలు భారత్‌పై ఆంక్షలు విధించాయి. అయినప్పటికీ వాజపేయి గారి నాయకత్వంలో ఏమాత్రం వెనుకడుగు వేయకుండా దేశాన్ని ఆర్థికంగా ముందుకు నడిపించారు. వాజపేయి గారి పాలనను భారతదేశ చరిత్రలో స్వర్ణయుగంగా పరిగణిస్తారు. బియ్యం, గోధుమల వంటి ముఖ్యమైన ధాన్యాల సరఫరా, ఎగుమతి వ్యవస్థలో మార్పులు ఆయన పాలనలోనే చోటుచేసుకున్నాయి. వాజపేయి గారి జయంతిని ప్రతి సంవత్సరం భారత ప్రభుత్వం మరియు బిజెపి "గుడ్ గవర్నెన్స్ డే"గా నిర్వహిస్తోంది. వాజపేయి గారు స్వయంసేవక్ సంఘ్ ప్రచారకుడిగా తన జీవితం ప్రారంభించి, ఆర్ఎస్ఎస్ నుంచి భారతీయ జనతా పార్టీలో చేరి దేశ ప్రధానిగా కావడం ఆయన అసామాన్య వ్యక్తిత్వానికి నిదర్శనం. అలాంటి గొప్ప వ్యక్తులను తీర్చిదిద్దిన ఆర్ఎస్ఎస్‌కు మనమంతా రుణపడి ఉన్నాం. వాజపేయి గారి లాంటి మహనీయులను దేశానికి అందించిన ఆర్ఎస్ఎస్, ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారిలాంటి నాయకులను కూడా తీర్చిదిద్దింది. రహదారుల నిర్మాణం ద్వారా దేశాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించిన వాజపేయి గారు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన దార్శనిక నాయకుడు. కొందరు ఆర్ఎస్ఎస్‌పై తప్పుగా మాట్లాడుతున్నారు. కానీ ఆర్ఎస్ఎస్ భారతదేశంలో పుట్టిన, భారతదేశం కోసం పుట్టిన సంస్థ. విమర్శకుల్లా చైనా, పాకిస్థాన్ ప్రయోజనాల కోసం మాట్లాడే పార్టీ కాదు. పేదలకు ఇండ్లు కల్పించాలనే సంకల్పంతో వాజపేయి గారు వాంబే అనే పథకాన్ని ప్రారంభించారు. అప్పట్లో దత్తాత్రేయ పార్లమెంట్ సభ్యులుగా ఉండగా, ఈ పథకం కింద అనేక మంది పేదలకు ఇండ్లు నిర్మించి ఇచ్చారు. ఇప్పటికీ వారు ఆ ఇళ్లలో నివసిస్తూ లబ్ధి పొందుతున్నారు. కానీ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయాయి. స్వాతంత్ర్య దినోత్సవం రోజున సీఎం రేవంత్ రెడ్డి అబద్ధపు వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టారు. రూ.22,500 కోట్లు కేటాయించి ఇండ్లు నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్లు కడతామని హామీ ఇచ్చింది. కానీ 19 నెలలు గడిచినా ఇప్పటి వరకు ఇండ్లు ఇచ్చిన దాఖలాల్లేవు. నిజమైన పేదలకు ఇండ్లు ఇవ్వకుండా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించే ప్రయత్నం జరుగుతోంది. దీని వలన అర్హులైన పేదలు మోసపోతున్నారన్నారు.. అటల్ బిహారీ వాజపేయి గారు ఆదర్శపురుషుడు. ఆయన పాలన మనకు స్ఫూర్తి, మార్గదర్శనం. బిజెపి కార్యకర్తలు మాత్రమే కాకుండా, ప్రతి పౌరుడు, ప్రతి రాజకీయ నాయకుడు కూడా ఆయన ఆశయబాటలో నడవడానికి కృషి చేయాలని నేను రామచంద్రా రావు కోరారు.

## పోలవరం కాఫర్ డ్యామ్.. రెండోసారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించడం లేదా..?

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా..? అసెంబ్లీ ఎన్నికల వేళ అత్యంత అనుమానాస్పదంగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లపై కేవలం 24 గంటల్లోపే ఎన్డీఎస్ఏను దించి బీఆర్ఎస్‌పై బురదజల్లిన బీజేపీ నేతలు.. కళ్లముందు రెండోసారి కొట్టుకుపోయిన పోలవరం కాఫర్ డ్యామ్‌పై ఎందుకు మౌనంగా ఉన్నారు..? ఏకంగా 10 అడుగుల వెడల్పు.. 7 నుంచి 8 అడుగుల లోతుకు కుంగిన పోలవరం కాఫర్ డ్యామ్‌ను గుట్టుచప్పుడు కాకుండా ఏపీలో యుద్ధప్రాతిపదికన రిపేర్ చేస్తుంటే.. తెలంగాణలో మాత్రం 20 నెలలు కావస్తున్నా మేడిగడ్డ బ్యారేజీ వద్ద తట్టెడు సిమెంట్‌కు దిక్కులేకపోవడానికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి మూర?త్వమే అని కేటీఆర్ మండిపడ్డారు. 2020లో పోలవరం డయాఫ్రం వాల్ రెండేండ్లకే కొట్టుకుపోయినా ఇప్పటికీ ఉలుకు లేదు, పలుకూ లేదు. మరోసారి ఏపీలో పోలవరం కాఫర్ డ్యామ్ గోదావరిపాలైనా, ఇటు తెలంగాణలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి 8 మంది మరణించినా ఇప్పటికీ ఎన్డీఎస్ఏ అడ్రస్ లేదు. పంజాబ్‌నే తలదన్నే స్థాయిలో తెలంగాణలో వ్యవసాయ విప్లవాన్ని సృష్టించి, దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ రైతును తీర్చిదిద్దిన కేసీఆర్‌పై కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలు సాగిస్తున్న మూకుమ్మడి కుట్రలను కాలరాస్తాం.. తెలంగాణకు జీవనాడి అయిన కాళేశ్వరం ప్రాజెక్టును కంటికి రెప్పలా కాపాడుకుంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. జై తెలంగాణ.. జై కాళేశ్వరం.. అని కేటీఆర్ నినదించారు.

## ప్రాణనష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలి

**హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆర్అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. అధిక వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనల వివరాలపై ప్రభుత్వ



స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు కల్వర్టులు, లో లెవెల్ వంతెనలు, కాజ్ వేల వద్ద ఇంజినీర్లు విధిగా తరచూ క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. ప్రాణనష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. అందుకు పోలీస్, విద్యుత్, రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీ రాజ్ శాఖల విభాగాలతో ఆర్ అండ్ బీ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజా రవాణాకు ఎక్కడా ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టులు వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. అధికారులు జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని, క్షేత్ర స్థాయి పరిస్థితులు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.

# ఆర్ ఎఫ్ సి ఎల్ ప్లాంట్ ను సందర్శించిన రామగుండం ఎమ్మెల్యే

**సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యానికి వినతి**



**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):** రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆర్ ఎస్ సి ఎల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఫ్యాక్టరీ నిర్మాణంలో జరిగిన అవకతవకలు,రాష్ట్రానికి రావలసిన యూరియా తో పాటు అనేక అంశాలతో కూడిన మెమోరండంను సంబంధిత మంత్రిత్వ శాఖ కు అధికారుల ద్వారా అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్ ఎఫ్ సి ఎల్ ప్లాంట్ 2021 లో ప్రారంభం అయినప్పటినుంది అమ్మోనియా పైప్ లైన్ లికేజ్ వల్ల ఉత్పత్తి ఆగిపోఉందని,పైప్ లైన్ నిర్మాణం నాసిరకంగా ఉండడంవల్ల అమ్మోనియా లీక్ అయి ఈ ప్రాంత ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని,ఈ పైప్ లైన్ నిర్మాణంపై సీబీఐ తో గాని ఎక్సపర్ట్ కమిటీతో విచారణ చేపట్టాలని,ఈ పైప్ లైన్ నిర్మించిన కంపెనీ ఈ ఐ ఎల్ నుండి పెనాల్టీ వసూల్ చేయాలని,సీన్ట్రేక్షన్,ఎరక్షన్ ప్రాబ్లేమ్ ను వెంటనే సరి చేయాలని,తెలంగాణాకు యూరియా కొరత లేకుండా చూసేందుకుగా యూరల్ డిషల్ గాను రాష్ట్ర ప్రభుత్వం 11శాతం పెట్టుబడి పెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి క్లియరెన్స్ ఇచ్చిందని,50 శాతం యూరియా తెలంగాణాకు ఇస్తామని ప్లాంట్ నిర్మాణ సమయంలో హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు.ఇప్పటివరకు అమలు జరగడం లేదన్నారు.గత ఏడాది కంటే ఈ సంవత్సరం సాగు పెరిగిందని,అదనంగా యూరియా సప్లై చేయాలసింది పోయి తెలంగాణాకు ఇవ్వవల్సిన యూరియా కోటాలో లక్ష టన్నుల యూరియా తగ్గించారని ఆరోపించారు. మే,జూన్,జులై,కోటాలో సగం కూడా ఇవ్వలేదని ఆగస్ట్ లో 65 వేల టన్నులకు గాను 20 వేల టన్నులే ఇచ్చారని ఇప్పుడు మళ్లి ఫ్యాక్టరీ షట్ డౌన్ అయిందన్నారు.జెడ్ ఎల్ డి జీరో లెవెల్ డిశ్చర్జ్ ప్లాంట్ ను ఉత్పత్తికి ముందే నిర్మించాలి కానీ 4సంవత్సరాలుగా టెండర్ కాల్ ఫర్ చేసి వాళ్లకు సంబంధించిన కాంట్రాక్టర్ రాకపోవడం తో వాయిదా వేయడం సరికాదన్నారు. రామగుండం ప్రజలు కాలుష్యంతో ఇబ్బందులు పడుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని,వెంటనే జెడ్ డి ఎల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని,ప్రాజెక్టు నిర్మాణ లోపాలతో వరుసగా షాట్ డౌన్ అవుతుందని,దీనివలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం ఫ్యాక్టరీ హెడ్ ఆఫీస్ ఇక్కడ లేకపోవడం కారణంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే నోయిడా నుండి కేంద్ర కార్యాలయాన్ని రామగుండానికి తరలించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ఫ్యాక్టరీ యజమాన్యం గాని కేంద్ర ప్రభుత్వం గాని స్పందించి సరియైన నిర్ణయం తీసుకోవాలని,రైతులకు సకాలంలో యూరియా అందించాలని,ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని పలు సవరణలు చేయాలని వీర్లపల్లి గ్రామాన్ని ఆర్ అండ్ ఆర్ కింద ఇతర ప్రాంతాలకు తరలించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వంపై ప్రజలు పెద్ద ఎత్తున తిరగబడతారని హెచ్చరించారు.

## నిరుపేదల ఆరోగ్యానికి అండగా ఎమ్మెల్యే మేఘారెడ్డి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని రోగులకు అండగా నిలుస్తున్నారు. జులై నెలలోనే 29 రూ.68.80 లక్షల విలువైన 239 సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేశారు. నాగపూర్ గ్రామానికి చెందిన కల్వకోలు సత్యం కుటుంబానికి మొత్తం రూ.8 లక్షల అందజేశారు. పార్టీలకతీతంగా సేవలందిస్తున్న ఎమ్మెల్యే మానవత్వాన్ని చాటుకుంటున్నారని ప్రజలు ప్రశంసిస్తున్నారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండిడ్:** ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. శ్రావణమాసం నాలుగవ శనివారం నిర్వహించే గట్టు చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి,తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థాన కమిటీ సభ్యులు వెన్న ఈశ్వరప్ప ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవభక్తితో మెలగాలని, దైవచింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని అన్నారు. దేవస్థానం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి,ఆశన్న విజయ్ కుమార్, బిజెపి ఉపాధ్యక్షులు మల్కయ్య,భద్రేశ్వర్, కిషన్ సెల్ అధ్యక్షులు సంటెం వెంకటయ్య,కురుమయ్య, శ్రీనివాస్ గౌడ్,నరేందర్, కృష్ణయ్య,రఘు తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడ బిడ్డ పెళ్లి కి ఆర్థిక సహాయం అందజేత

**బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బావండ్ల మధు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి పట్టణానికి చెందిన పేదింటి కుటుంబానికి చెందిన మహేశ్వరి పేదింటి కుటుంబానికి చెందిన ఆడపడుచు కావడంతో విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భావండ్ల మధు స్పందించి, 10,000 వేల రూపాయలు యువతి కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ 5000/- రూపాయల కిరాణం ఇప్పించారు.ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ యువతి వివాహం రేపు జరగనుంది కాబట్టి దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఒక ఆడపిల్ల పెళ్లి కోసం తోచిన సహాయం చేయాలని వేడుకున్నారు కార్యక్రమంలో శివ,సాయి తదితరులు పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా

**– సౌత్ ఇండియా ఉపాధ్యక్షులుగా రంగు శ్యామ్ సుందర్**




**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ ఆగష్టు 16** గోదావరిఖని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ గా రంగు శ్యామ్ సుందర్ నియామకం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని కి చెందిన రంగు శ్యామ్ సుందర్ ఎన్నికయ్యారు. గత నాలుగు సంవత్సరాలుగా సంస్థ అభివృద్ధికి పాటుపడుతూ, మానవ హక్కుల పరిరక్షణ కోసం, హక్కుల పురోగతి కోసం పాటుపడుతున్న శ్యామ్ సుందర్ గతంలో వివిధ పదవులలో పని చేసిన సేవలను గుర్తించి హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జాతీయ చైర్మన్ చెన్నుపాటి శ్రీకాంత్ సౌత్ ఇండియా ఉపాధ్యక్షుడిగా శ్యామ్ సుందర్ ని నియమించడం జరిగినది. ఈ పదవిలో రెండు సంవత్సరాల కాల పరిమతి కొనసాగుతారు.ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన, జాతీయ ప్రధాన కార్యదర్శి చారేంద్ర జాతీయ ఉపాధ్యక్షుడు భేతి తిరుమల్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తగ్గీర్, చాడ రవీంద్ర రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

# వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇండ్లు ఇప్పిస్తా



**పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు.**

**ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని జిల్లా కలెక్టర్ కు ఫోన్.**

**అగ్నిధారపెద్దపల్లి టౌన్, ఆగస్టు 16:** శాసనసభ్యునిగా తన గెలుపును 90 శాతం మంది జర్నలిస్టులు కోరుకున్నారని, ఎన్నో ఏళ్లుగా ఇంటి స్థలాలు, ఇండ్ల కోసం పోరాడుతున్న జర్నలిస్టుల సమస్యను పరిష్కరిస్తానని పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయ రమణారావు స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లిలోని క్యాంపు కార్యాలయంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీడబ్ల్యూజేఎఫ్, పెద్దపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఎమ్మెల్యేను కలిసి పెద్దపల్లి పట్టణం, మండల పరిధిలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల జాబితాతో కూడుకున్న వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు ప్రతినిధులు గత తొమ్మిదేళ్లుగా తాము ఇళ్ల స్థలాలు, ఇండ్ల కోసం పోరాటం చేస్తున్నామని, కానీ గత ప్రభుత్వం తమ సమస్యలను తీర్చలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తమకు ఆశలు కలిగాయని, ఈ విషయమై ఎమ్మెల్యే విజయరమణ రావుతో పాటు మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి వినతి పత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు. ఈ విషయమై సానుకూలంగా ఎమ్మెల్యే సూచనల మేరకు వర్కింగ్ జర్నలిస్టుల జాబితాను రూపొందించామని జర్నలిస్టులు వివరించారు. అలాగే ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి కలెక్టరేట్ కు సమీపంలో గల సర్వే నంబర్ 129లో 5 గుంటల ప్రభుత్వ భూమిని ఇప్పించాలని కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ జర్నలిస్టుల కోరుతున్న కోరికలు న్యాయమైనవని, గత ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి ఇవ్వలేదని అన్నారు. వెంటనే ప్రభుత్వ స్థలాలను గుర్తించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తామని, సొంత ఇంటి స్థలం ఉన్న జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ వెంటనే జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫోన్ చేసి జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు గాను పెద్దపల్లి పట్టణం, శివారులో ప్రభుత్వ భూములను త్వరగా గుర్తించాలని చెప్పారు. అలాగే ప్రైవేటు విద్యాసంస్థల్లో జర్నలిస్టులకు 50 శాతం రాయితీ ఇప్పించే విధంగా జర్నలిస్టులు ఇచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. జర్నలిస్టుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే విజయరమణా రావుకు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, నారాయణదాసు అశోక్, చింతకింది చంద్రమౌళి, పోగుల విజయ్ కుమార్, ఎండి గౌస్ పాషా, బాలసాని రాజయ్య, బాలసాని వెంకటేశం గౌడ్, లింగమూర్తి, వీరమల్ల విద్యాసాగర్, ఆకుల రమేష్, తిరుమల సురేష్, జర్నలిస్టులు సంపత్, ముఖేష్, చేగొండ రవికుమార్, కన్నూరి ఆంజనేయులు, ఎండి ఇబ్రహీం, సతీష్, చంద్రమౌళి, సత్యనారాయణ, అడిచెర్ల రమేష్, మాజిద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి నది తీర సమీప గ్రామాల ప్రజలకు ప్రమాద హెచ్చరిక

– మంథని ఎస్సై రమేష్



**అగ్నిధార న్యూస్ మంథని :** అధిక వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టు ,శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు యొక్క గేట్లు శనివారం సాయంత్రం సంబంధిత అధికారులు ఓపెన్ చేసినందున గోదావరి నదిలో అధిక నీటి ప్రవాహం ఉండనుందని మంథని మండలంలోని గోదావరి నది తీర సమీప గ్రామాల ప్రజలు, మత్స్యకారులు, పశుకాపర్లు వ్యవసాయదారులు గ్రామస్తులు ఎవరు కూడా గోదావరి నదికి వెళ్ళద్దని మంథని ఎస్సై ఒక ప్రకటనలో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.

## నూతన నియామకం..!



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** కమాన్ పూర్ మండల కేంద్రంలోని రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియ మండల కేంద్రంలోని కేశవ గార్డెన్ లో శనివారం నిర్వహించారు. ఈ నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా జంగపెల్లి కనకయ్య, అధ్యక్షులుగా జంగపెల్లి వెంకటేశం, ఉపాధ్యక్షులుగా జంగపెల్లి ఎల్లయ్య, కోశాధికారిగా జంగపెల్లి రవి, కార్యవర్గ సభ్యులుగా బొడ్డుపల్లి సదయ్య, జంగపల్లి నాగరాజు, నల్లూరి శంకర్, తోటపెల్లి కొమురయ్య, జంగపల్లి నాగరాజు, జంగపల్లి శ్రీనివాస్, జంగపల్లి శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కుస్నూర్ వాగును పరిశీలించిన ఆర్ బీ ఈఈ,డిఈ



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాల కారణంగా సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలవ్యాప్తంగా వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి,మండలంలోని కుస్నూర్ గ్రామంలో ఉన్న వాగు ఉదృతంగా ప్రవహిస్తుంది కాగా శనివారం ఆర్ బీ ఈఈ నర్సింలు,డిఈ రవీందర్ వాగును పరిశీలించి పోలీసులను స్థానికులను వివరాలు అడిగి తెలుసుకుని ప్రజలు ఎవ్వరు కుడా వాగు దాటడానికి ప్రయత్నించి ప్రాణాలమీదకు తెచుకోవద్దని సూచించారు,అలాగే ఇందూర్,బొగులంపల్లి ప్రాజెక్టు మత్తడి నుండి వరద ఉధృతితో పొంగిపొర్లుతుంది,దింతో ఎస్సై చైతన్య కిరణ్, పోలీసు సిబ్బంది వెళ్లి స్వయంగా పరిశీలించి ప్రజలకు పలు సూచనలు చేశారు అలాగే ఎక్కడెక్కడ వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయో వాటిని ఎప్పటికప్పుడు పోలీసులు, పలువురు అధికారులు పరిశీలించి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తు అప్రమత్తం చేస్తున్నారు,ఆ ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది వెళ్లి నిరంతరం పరిశీలిస్తు పరిస్థితి ని ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలుపుతున్నారు.

## గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు

– మంథని ఎస్సై రమేష్




**అగ్నిధార న్యూస్ మంథని :** తెలంగాణ రాష్ట్ర యాంటి నార్కోటిక్స్ బ్యూరో, రామగుండం పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని గద్దలపల్లి,విలోచవరం గ్రామాలలో మంథని ఎస్సై డేగ రమేష్ ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులకు,యువతకు గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా గంజాయి, మత్తు పదార్థాల అలవాటుతో భావితరాల యువత భవిష్యత్తు అంధకారం అవుతుందని అన్నారు.గ్రామాలలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై తల్లిదండ్రులు తీసుకోవాల్సిన బాధ్యతను వివరించారు.గ్రామాలలో మత్తు పదార్థాల రవాణా, సరఫరా గురించి వివరాలు తెలిసిన వెంటనే సమాచారం పోలీసులకు అందించాలని కోరారు.గంజాయి, మత్తు పదార్థాల రవాణా, సరఫరా విషయంలో ఎంతటి వారిపైనైనా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సై వెంట ఏఎస్సై మల్లేశం,హెడ్ కానిస్టేబుల్ కృష్ణా నాయక్, కానిస్టేబుల్ అజయ్, హెచ్ జీ వెంకటేష్ పాల్గొన్నారు.

# మెడికల్ బోర్డు లోపాలను సరి చేయండి

**సింగరేణి ఆర్జీవన్ జీఎం కు ఐఎఫ్టియు వినతి**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** సింగరేణి మెడికల్ బోర్డు లో ఉన్న లోపాలను సరిచేయాలని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐఎఫ్ టి యు) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం యూనియన్ నాయకులు సింగరేణి ఆర్జీవన్ జీఎం కార్యాలయంలో జీఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ.నరేష్ మాట్లాడుతూ 55 మంది కార్మికులు దీర్ఘకాలిక జబ్బుల తో కంపెనీ హాస్పిటల్ లో వైద్యం తీసుకుంటూ నిత్యం మందులతో జీవితం గడుపుతున్నారని,గత 31న మెడికల్ బోర్డుకు హాజరైన వారిలో 5 గురిని అన్ఫిట్ చేసి మిగిలిన వారిని తిరస్క రించడం సరికాదన్నారు. బోర్డు ఫిట్ చేసిన వారిలో తీవ్ర గుండె జబ్బులు,మూత్రపిండాలు,ఊపిరితిత్తులు,పక్షవాతం తదితర అనేక రకాలైన జబ్బులతో విధులకు హాజరుకాలేని కార్మికులను కూడా విధులకు హాజరు కావాలని చెప్పడం అమానవీయమన్నారు. జబ్బులతో బాధపడేవారు విధులకు గైర్హాజరు అయ్యే వృద్ధుల కన్నా నవ యువకులైన వారి వారసులకు ఉద్యోగం ఇస్తే ఉత్పత్తి,ఉత్పాదకత పెంచడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్మికులను కుదించాలనే యాజమాన్యం కుట్రలో భాగంగా కార్మికులను మానసిక శారీరక వేధింపులకు గురిచేయడం కార్మిక వ్యతిరేకమైనదన్నారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసిన వారిలో 32 మందిని ఫిట్ చేస్తూ బోర్డు నిర్ణయం తీసుకుందని,అందులో 17 మందిని తమ డిసిగ్నేషన్లకు అన్ఫిట్ చేసి తక్కువ స్థాయి డిజైనేషన్ కు మార్చారని,ఇది కంపెనీలో అమలులో ఉన్న ఒప్పందాల ప్రకారం సూటబుల్ జాబ్ ఇవ్వాల్సి ఉండగా సూపర్వైజ ర్లను జనరల్



మజ్దూర్లుగా ఫిట్ చేయడం గత ఒప్పందాలకు వ్యతిరేకమైనద న్నారు. మెడికల్ బోర్డు తీసుకున్న నిర్ణయం సింగరేణి వ్యాప్తంగా కార్మికులందరిలో భయానక పరిస్థితి కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం పునరాలోచించి మెడికల్ బోర్డు ను సవరించాలని,వివిధ రకాల జబ్బులతో డ్యూటీ చేయలేక సర్వీస్ నుంచి అన్ఫిట్ చేయాలని దరఖాస్తు చేసిన కార్మికులందరినీ అన్ఫిట్ చేసి వారి వారసులకు కారుణ్య నియామకాల పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐఎఫ్ టి యు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ.నరేష్,రామగుండం రీజియన్ కార్యదర్శి ఈదునూరీ రామకృష్ణ,నాయకులు ఐ.రాజేశం,ఆర్జీవన్ అధ్యక్షులు ఎస్.ప్రసాద్,నాయకులు పి.మొండయ్య,ఏ.చంద్రయ్య, గుండేటి మల్లేశం, చింతల శేఖర్,ఎన్ సి బాబు,అవినాష్ పాల్గొన్నారు.

## సతీష్ యాదవ్‌కు డాక్టరేట్



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** 16 ఆగస్టు 2025న పాండిచ్చేరిలో గ్లోబల్ అక్రిడేషన్ కౌన్సిల్,పాండి యూనివర్సిటీ ఆధ్వర్యంలో, యునైటెడ్ నేషన్ నేషనల్ పీస్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్య వేదిక అధ్యక్షుడు, వనపర్తి మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ కి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. 25 ఏళ్లుగా సామాజిక సేవ లో, ముఖ్యంగా గత 18 ఏళ్లుగా ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటానికి గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ “నా సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ఇవ్వడం గర్వకారణం. ఇది మరింత బాధ్యత ను కల్పించింది. వనపర్తి ప్రజలకు కృతజ్ఞతలు” అన్నారు.

## పేదింటి ఆడ బిడ్డ పెళ్లి కి ఆర్థిక సహాయం అందజేత

**బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బావండ్ల మధు**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**కల్వకుర్తి పట్టణానికి చెందిన పేదింటి కుటుంబానికి చెందిన మహేశ్వరి పేదింటి కుటుంబానికి చెందిన ఆడపడుచు కావడంతో విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భావండ్ల మధు స్పందించి, 10,000 వేల రూపాయలు యువతి కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ 5000/- రూపాయల కిరాణం ఇప్పించారు. ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ యువతి వివాహం రేపు జరగనుంది కాబట్టి దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఒక ఆడపిల్ల పెళ్లి కోసం తోచిన సహాయం చేయాలని వేడుకున్నారు కార్యక్రమంలో శివ,సాయి తదితరులు పాల్గొన్నారు.

## రోజుకు రూ.2లతో రూ.15 లక్షల ప్రమాద బీమా

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** రోజుకు రూ. 2లతో రూ. 15 లక్షల ప్రమాద బీమారోజుకు రూ. 2 కడితే రూ. 15 లక్షల ప్రమాద బీమాను పొందవచ్చు. తపాలా శాఖ, ఆదిత్య బిర్లా క్యాపిటల్ తో కలిసి ఈ ప్రమాద బీమా పాలసీని అందుబాటు లోకి తెచ్చింది. రోజుకు రూ. 1.50తో రూ. 10లక్షలు, రూ. 2 లతో రూ. 15లక్షల బీమా పాలసీలు అందుబాటులో ఉన్నా యి. ఏడాదికి రూ. 549 ప్రీమియంతో అకాల మరణాలకు రూ. 10 లక్షలు, రూ. 749 ప్రీమియంతో రూ. 15 లక్షలు అందిస్తారు. బీమా పాలసీకి 18-65 సంవత్సరాల మధ్య వ యసు గల వారు అర్హులు. మిగతా సమాచారం కోసం సమీపంలో ఉన్న పోస్ట్ ఆఫీసు లో సంప్రదించగలరు.




# చెరువులను తలపిస్తున్న మార్కండేయ కాలనీ వీధులు

**మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా నిలిచిపోయిన వర్షపు నీరు**

**పన్నుల వసూల్లో ఫస్ట్, సౌకర్యాల విషయంలో లాస్ట్**

**నీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేసిన సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కనకరాజ్**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మార్కండేయ కాలనీ వీధులన్నీ జలమయమై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా నిలిచాయని సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కె. కనకరాజ్ అన్నారు. నిలిచిన నీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కండేయ కాలనీ పాత 26వ డివిజన్ కొత్త 49వ డివిజన్ లోని బి సి హాస్టల్ లైన్ లో అధికంగా నీరు నిలిచిపోవడం వల్ల చెరువును తలపించే విధంగా ఉందని అట్టి వర్షపు నీరు ఇళ్లల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని అన్నారు. మార్కండేయ కాలనీ వీధుల దుస్థితి పై మున్సిపల్ అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదనీ అన్నారు. వర్షపు నీరు వరదలా వచ్చి నిలవడం వల్ల ప్రజలు అనేక అవస్థలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇదే వీధిలో నూతనంగా నిర్మించిన పెద్ద కాలువకు సైడ్ వాల్ నిర్మించారని సైడ్ వాల్ కు రంధ్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల సైడ్ వాల్ వద్ద వర్షపు నీరు మోకాళ్ళ లోతు నిలిచిపోయాయని అన్నారు. బీసీ హాస్టల్ లైన్ లో రోడ్డు గుంతలుగా మారు మారి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వీధి ప్రజలకు మీరు నిలిచి నిలిచిపోవడం వల్ల ఏ గుంత ఎక్కడుందో తెలియక వాహనదారులు పడిపోతున్నారని కనీస రోడ్డు సౌకర్యం కల్పించలేని దుస్థితిలో పాలకులు ,అధికారులు ఉన్నారని అన్నారు. కార్పొరేషన్ పరిధిలో లక్ష్మీ నగర్ తర్వాత అత్యధిక పన్నులు వసూలు చేస్తున్న ప్రాంతం మార్కండేయ కాలనీ అని సౌకర్యాలు మాత్రం అత్యల్పంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు డివిజన్లో కనీసం వీధి దీపాలు లేవని ఏదైనా ప్రాబ్లం ఉండి లైట్ల కోసం అధికారులకు తెలియజేస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. డివిజన్ లో రాత్రి సమయంలో



చీకటిగా ఉండి కూడా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మార్కండేయ కాలనీ పరిధిలో ఉన్న అన్ని వీధులలో కనీస సౌకర్యాలు కల్పించకుండా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తే సిపిఐ ప్రజల సహకారంతో ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కార్యక్రమా లు చేపడతామని కనక రాజ్ హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి డివిజన్ లోని సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# రామగుండం లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే

**తీవ్ర వర్షంలోనూ ప్రజలను కలిసిన ఎమ్మెల్యే**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శనివారం తెల్లవారుజాము నుంచి తీవ్రస్థాయిలో వర్షం కురుస్తున్నందున రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.




పట్టణంలోని సప్తగిరి కాలనీ, పరిసర ప్రాంతాలలో పరిస్థితిని పరిశీలించి అక్కడి ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రధాన డ్రైనేజీలను ఆయన పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు వరద నీరు మురికి కాలువల నుంచి వెళ్తుండడంతో లోతట్టు ప్రాంతాలకు ఎలాంటి ప్రమాదం లేదని ఆయన పేర్కొన్నారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత బి.ఆర్.ఎస్ పార్టీ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి వాన కాలంలో ఇక్కడి ప్రజలను చాలా ఇబ్బందులకు గురిచేసిన విషయం గుర్తు చేశారు. వర్షాకాలం వచ్చిందంటే ఏకంగా పడవలు వేసుకొని ప్రజలను... వారి ఆస్తులను కాపాడే పరిస్థితి ఉండేదని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన నిర్వహిస్తుందని అన్నారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఈ ప్రాంతంలో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇదే క్రమంలో ప్రధాన నాలా లను నిర్మించడం వల్ల వాటిని ఆనుకొని ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రమాదం వచ్చినప్పుడు వారిని కాపాడడమే కాకుండా... అలాంటి పరిస్థితులు రాకుండా ప్రజలకు ముందస్తు చర్యలను చేపట్టడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆయన వెంట అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు. వర్షాకాలం ముగిసే వరకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అదేవిధంగా కార్పొరేషన్ లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు

## భారీ వర్షానికి నీరు చేరిన ఇండ్లను పరిశీలించిన ఈదునూరి రవి

**ఎమ్మెల్యే ఆదేశాలతో జెసిపి ద్వారా కాలువ తీసి నీళ్లు తొలగింపు**




**అగ్నిధార న్యూస్,( రామగుండం):** శనివారం కురిసిన భారీ వర్షానికి రామగుండం కార్పొరేషన్ జంగాలపల్లి గ్రామంలోని 15 కుటుంబాల ఇండ్ల లోకి నీళ్లు నీళ్లు చేరి చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి రవి నీట మునిగిన ఇండ్లను పరిశీలించారు. ఈ విషయాన్ని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కి తెలియజేశారు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి నీళ్లు తొలగించాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు జెసిబి సహాయంతో కాలువ తీసి ఇళ్లల్లో చేరిన నీరును తొలగించారు. డివిజన్ ప్రజలు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కి , మున్సిపాలిటీ మున్సిపల్ సిబ్బందికి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదునూరి రవికి కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు

**బిజేపి రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి..**



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని శనివారం మార్కండేయ కాలనీలోని శ్రీకృష్ణ టెంపుల్ నందు భక్తిశ్రద్ధలతో బిజేపి రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి - పోచం గార్లు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు....ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి, శ్రీకృష్ణుని జన్మోత్సవం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన బీజేపీ నాయకులు కందుల సంధ్యారాణి- పోచం దంపతుల ను ఆలయ కమిటీ తరపున శాలువాతో ఘనంగా సన్మానించారు. వారి ఆధ్యాత్మిక చైతన్యం సేవా దృకృథాన్ని కమిటీ సభ్యులు అభినందించారు. ఆలయ అభివృద్ధిలో వారి సహకారం కోసం కృతజ్ఞతలు తెలిపారు... అనంతరం ఎన్టీపీసీ కాజీపల్లి గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో కందుల సంధ్యారాణి హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు ప్రాంతాలకు పరిశీలన

**మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్**



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ స్థానిక పోలీస్ అధికారులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు రాళ్లవాగు, మంచిర్యాల, లక్సెట్టిపేట్ పరిధిలోనీ గ్రామాలు గంపలపల్లి, కొమ్ముగూడెం, గోదావరి నది పరివాహక ప్రాంతాలు, చెరువులు, వాగులు, వంతెనలు ప్రధాన రహదారులను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ .. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నాము అన్నారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము అని తెలిపారు. అలాగే వివిధ గ్రామాలకు అనుసంధానంగా ఉన్న కల్వర్టు, బ్రిడ్జిలు నీటిమునిగే ప్రమాదం ఉన్నందున, వరద నీటి ఉధృతిని అంచనా వేయకుండా నదులు, వాగులు, కాలువలు, కుంటలు దాటే ప్రయత్నం చేయకూడదు అన్నారు .వర్షాల కారణంగా ప్రజలు అనవసరంగా బయటకు వెళ్లకుండా, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర సహాయం కోసం ప్రజలు 100 నంబర్‌కు కాల్ చేయవచ్చు అన్నారు. డిసిపి వెంట మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, లక్షెట్టి పేట్ సిఐ రమణమూర్తి ఎస్ఐ సురేష్ తదితరులు ఉన్నారు

## ఘనంగా కొరివి కృష్ణస్వామి జయంతి వేడుకలు



**అగ్నిధార న్యూస్ :శంకర పట్నం ఆగస్ట్/16** శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గం ఆదేశాల మేరకు కొరివి కృష్ణ స్వామి ఆశయాలకు ఆకాంక్షలకు అనుగుణంగా ముదిరాజు బిడ్డ హైదరాబాద్ ప్రథమ పౌరులు బహుముఖ ప్రజ్ఞాశాలి పాత్రికేయులు, రచయిత, అయిన కొరివి కృష్ణ స్వామి జయంతి వేడుకలను తాడికల్ గ్రామ మాజీ సర్పంచ్ అయిన కీసర సుజాత సంపత్, ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జోడు బాలరాజు, మరియు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు రానవేని మల్లయ్య ,ఉపాధ్యక్షులు కీసర మొండయ్య, కార్యదర్శి పోలు వెంకన్న కీసర వెంకీ కాంగ్రెస్ నాయకులు,గౌరవ సభ్యులు భారీ సంఖ్యలో కులస్తులు పాల్గొన్నారు.

# పి ఆర్ పి సాధనే లక్ష్యంగా అధికారుల పోరుకు సంఘీభావ మద్దతు

**సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటియుసి (గుర్తింపు సంఘం)**



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** సింగరేణిలో ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ కీలకంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులకు పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ (పి ఆర్ పి) చెల్లించకపోవడం దురదృష్టకరం బాధాకరం అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీలు కే. వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహజంగానే అధికారులు అంటేనే యాజమాన్యం యాజమాన్యానికి హక్కులు, సౌకర్యాలు కల్పించడంలో సింగరేణి సంస్థతో పాటు ప్రభుత్వం కూడా ఎలాంటి లాభాలు అయినను లేదా ఎలాంటి పేమెంట్లు అయినను వెంటనే నిర్ణయం తీసుకుంటుంది అని అనుకుంటాము. ఎందుకంటే యాజమాన్యంలో భాగస్వాములైన అధికారులు వ్యక్తిగతంగాను, కుటుంబ పరంగాను ఆర్థికపరంగాను ఆనందంగా ఉంటేనే వారి వ్యక్తిగత పని విధానం మెరుగుపరచుకొని మనస్ఫూర్తిగా ఉత్పత్తి సాధనలో దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు కానీ ఈ మధ్యకాలంలో ఎలాంటి పేమెంట్లు అయినను, పే స్కేల్స్ అయినను ఇవ్వడంలో యాజమాన్య ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. అందువల్ల అధికారులే పోరు బాట పట్టారు. అధికారులకు తిరుగుబాటు ఆలోచన వస్తే సహజంగానే సహాయ నిరాకరణ ఏర్పడుతుంది. తద్వారా నిర్దేశిత లక్ష్యాలు కావచ్చు, బొగ్గు రవాణా కావచ్చు లేదా సింగరేణి ఎదుర్కొంటున్న సమస్యలు కావచ్చు సకాలంలో సాకారానికి నోచుకోవు. ఇప్పటికే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కంపెనీ పేపర్ల పైన లాభాలు చూపిస్తూ ముందుకు వెళుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులలో అధికారులు ఇబ్బంది పడటం సంస్థకు నష్టం. వారేమీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. వారి యొక్క జీతభత్యాలలో భాగమైన పిఆర్పిని కోరితే వారి విన్నపాన్ని మన్నించకుండా అధికారులే పోరాట రూపాలు ఎంచుకొని వేజ్ బోర్డు ఉద్యోగుల వలె ఉద్యమించటం సంస్థ డొల్లతనాన్ని తెలియజేస్తుంది. అధికారులు లేకుండా ఉద్యోగులు ఎట్టి పరిస్థితులలో కూడా నిర్దేశిత లక్ష్యాలను సాధించడం జరగదు. చాలామంది అధికారులు సమర్థవంతంగా వారి వ్యక్తిగత జీవన విధానాన్ని కూడా లెక్కచేయకుండా సంస్థ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నారు. రాజకీయ జోక్యాలు, ప్రభుత్వాల పెత్తనంతో సంస్థ అడ్మినిస్ట్రేషన్ గాడి తప్పింది. ఇప్పటికే సింగరేణి సంస్థకు 40 వేల కోట్ల రూపాయలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖల ద్వారా రావలసి ఉంది. అలాగే సంస్థకు సంబంధించిన కోట్ల రూపాయలను తెలంగాణ ప్రభుత్వం మనకు ఏమాత్రం సంబంధంలేని వాటికి ఖర్చు పెడుతూ మనల్ని నిలువునా ముంచుతుందన్నారు. ఈ మధ్య పెద్దపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా కొత్తగా నియామకం పొందిన ప్రభుత్వ ఉద్యోగులు, సింగరేణి ఉద్యోగులకు అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇచ్చిన సందర్భంలో, వైరాలో జరిగిన జాబు మేళాకు మరియు రాజీవ్ అభయ హస్తం పేరుతొ సంస్థకు సంబంధం లేని వ్యక్తులు సివిల్ సర్వీసులో ప్రిలిమినరీ పరీక్ష పాస్ అయిన ప్రతి ఒక్కరికి లక్ష రూపాయల చొప్పున సింగరేణి కోట్లు ఖర్చు పెడుతుంది. నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిరుద్యోగులను ప్రోత్సహించుటకు హైదరాబాదులో, ఢిల్లీలో ఉచితంగా ప్రభుత్వ సొమ్ముతో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవచ్చును. అలా కాకుండా అత్త సొమ్మును అల్లుడు దానం చేసినట్టు సింగరేణి సొమ్మును ధారా దత్తం చేయడం ఎంతవరకు సమంజసం. ఎవరికో సంబంధం లేని వ్యక్తులకు సంస్థ సొమ్మును అప్పనంగా ఇస్తూ, సంస్థ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న అధికారులకు రావలసిన పిఆర్పి విషయంలో నిర్లక్ష్యం వహించడం ఎంత మాత్రం కరెక్ట్ కాదు. తక్షణమే దీనిని సరిచేసుకొని వారికి రావలసిన పిఆర్పిని చెల్లించాలని సింగరేణి సంస్థను డిమాండ్ చేస్తున్నాము. లేనట్లయితే సింగరేణిలో కార్మికుల సమస్యలతో పాటు అధికారుల సమస్యలను కూడా జోడించి అన్ని సంఘాలను కలుపుకొని సింగరేణిలో భారీ ఉద్యమానికి తెర తీస్తామని హెచ్చరించారు.

# 8వ సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ ట్రస్ట్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ ల సమావేశం



**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం ఆగస్టు 16** సింగరేణి ప్రధాన కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు తేదీ:16.08.2025 శనివారం నాడు ఎన్ సిడబల్యూఏ ఉద్యోగులకు సంబంధించిన,4 ట్రస్టీ లకు సంబంధించిన సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ 8వ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ,ఆఫీసర్లకు సంబంధించిన సిపిఆర్ఎంఎస్-ఈ 6 వ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల,బోర్డ్ ఆఫ్ గ్రాట్యుటీ ట్రస్టీ మరియు 9 వ ఈడిసిపిఎస్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల,సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశానికి ఛైర్మన్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరాం,ఐఆర్ఎస్ ముఖ్య అతిథిగా.. హాజరైనారు. ఈ సమావేశంలో ముందుగా గత ఆర్థిక సంవత్సరం 2023-24 కి సంబంధించిన ఆర్థిక లావాదేవీల సంబంధించిన ఆడిట్ రిపోర్ట్ ను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికేర్ స్కీమ్ అంశంపై సమీక్ష నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరం నుండి ఇప్పటివరకు మారిన ట్రస్టు సభ్యుల స్థానం లో కొత్త సభ్యులను ఆమోదించి అనంతరం సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ ట్రస్ట్ కు సంబంధించి అత్యంత కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలను తీసుకోవటం జరిగినది. ఈ సమావేశం లో గుర్తింపు సంఘం ప్రెసిడెంట్ వి.సీతారామయ్య మాట్లాడుతూ...సంస్థ చే ఆమోదించబడిన ఆసుపత్రులలో వ్యాధి నిర్ధారణ కేంద్రాలలో సి పి ఆర్ ఎం ఎస్ కార్డులను కలిగి వున్న వారికి సకాలంలో వైద్యం అందించాలనికోరారు. పదవీ విరమణ పొందే ఉద్యోగులు వారి పదవీ విరమణ రోజునే సిపిఆర్ఎం ఎస్-ఎన్ఈ మెడికల్ కార్డును ఇవ్వాలని కోరటం జరిగినది. దీనికిగాను సర్క్యులర్‌ను జారీచేయడం జరిగిందని తెలియజేయడం మరియు పునః పరిశీలన జరిగింది. ట్రస్ట్ ల పరీక్షలలో భాగంగా మరియొకసారి సర్క్యులర్ ను తిరిగి జారీచేయడం జరిగింది. అదే విధముగా ఉద్యోగులకు సంబందించి గ్రాట్యుటీ మరియు ఈడిసిపిఎస్ అంశంపై సమీక్ష ను నిర్వహించారు. ఈ కార్యక్రమములో సింగరేణి ఛైర్మన్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరాం ఐ ఆర్ యస్,తో పాటు సింగరేణి డైరక్టర్(పా)గౌతమ్ పొట్రు ఐ ఏ యస్, డైరక్టర్(ఈ ఎం) డి.సత్యనారాయణ రావు, డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, డైరక్టర్(పి పి) కె.వేంకటేశ్వర్లు,గుర్తింపు సంఘం (ఏఐటియూసి)ప్రెసిడెంట్ వి.సీతా రామయ్య, గుర్తింపు సంఘం(ఏఐటియూసి) జనరల్ సెక్రటరీ కే.రాజ్ కుమార్ సిఎంఓఏఐ ప్రెసిడెంట్ టి.లక్ష్మీపతి గౌడ్ జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ శ్రీ జి.వి.కిరణ్ కుమార్ జిఎం(పర్సనల్) ఐఆర్ పిఎం కవితా నాయుడు,జిఎం(ఫైనాన్స్) ఎం.సుబ్బా రావు,సిఎంఓ ఆర్.కిరణ్ రాజ్ కుమార్, జిఎం(ఈఈ సెల్) ఏజేఎం మురళీధర రావు,హెచ్ఓడి (ఐఈడి)బొజ్జ రవి,కంపనీ సెక్రటరీ సునీతా దేవి, డిజిఎం(పర్సనల్)లు కేసా నారాయణ రావు,బి.శివ కేశవ రావు,ముకుంద సత్యనారాయణ, ప్రాజెక్ట్ మేనేజర్ (ఈఆర్‌పి) హరప్రసాద్,డిజిఎం ఐటి యం. శ్రీనివాస రావు, డివై.సిఎంఓ సునీల, డివై.పిఎం కే.శివ కుమార్, డివై.ఎఫ్ఎం ఈ.రమేశ్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రామా రావు మరియు ఇతర అధికారులు మరియు సిపిఆర్ఎంఎస్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు కల్వకుర్తి నియోజకవర్గంలో సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి పర్యటన




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** నేడు కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి వివిధ కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఆమనగల్ మండలం మేడిగడ్డ తండాలో ఉదయం ఎనిమిది గంటలకుఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత మొబైల్ హెల్త్ క్యాంప్ ను సందర్శించనున్నారు. అనంతరం వెల్దండ మండలం చౌదరి పల్లి గ్రామానికి చెందిన ఎనుముల వెంకటయ్య యాదవ్ కుమార్తె వివాహానికి మధ్యాహ్నం 12:00 గంటలకు బి ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్ కి హాజరు కానున్నారు. అనంతరం కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామంలో మధ్యాహ్నం 12:45 నిమిషాలకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అనంతరం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని భగత్ సింగ్ తండాలో మధ్యాహ్నం 2:00 గంటలకు జరిగే తీజ్ ఉత్సవాలకు పాల్గొననున్నారు. అనంతరం ఆమనగల్ పట్టణంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి బోనాల ఉత్సవాలకు సాయంత్రం 4:00గంటలకు హాజరుకానున్నారు. అనంతరంకడ్తాల్ మండలంలోని బాలాజీనగర్ తండాదుర్గా మాత బోనాలకు సాయంత్రం 5:00 గంటలకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ హాజరు కానున్నారు. కావునప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు మరియు అందుబాటులో ఉన్న స్థానిక నాయకులు, కార్యకర్తలు అభిమానులు, శ్రేయోభిలాషులందరు పాల్గొనగలరు.

## నిరుపేద కుటుంబానికి చెందిన ఆడపడుచు పెళ్లికి చేయూత

**ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**కల్వకుర్తి పట్టణానికి చెందిన మహేశ్వరి పేదింటి కుటుంబానికి చెందిన ఆడపడుచు కావడంతో ఆనంద్ గౌడ్ ద్వారా విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ రాష్ట మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ యువతి వివాహానికి 5000 రూపాయలు కిరాణం సరుకులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మాయి కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమంలో శివ,సాయి తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధి దారులకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలి

**సి పి ఎం జిల్ల నాయకులు ఆంజనేయులు**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలో దాదాపు 25 సంవత్సరాల క్రితం సర్వేనెంబర్ 281/2లో 8 ఎకరాల భూమిలో 165 మందికి ఒక్కొక్కరికి 136 గజాల చొప్పునఇళ్ల స్థలం కేటాయించి పట్టా సర్టిఫికెట్లు ఇచ్చారు. మరియు సర్వేనెంబర్ 273/2లో రెండు ఎకరాలలో 121 గజం చొప్పున 41 మందికి ప్లాట్లు కేటాయించి సర్టిఫికెట్లు ఇచ్చారు. 25 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు పంపిణీ చేయడం లేదని ఇందిరమ్మ ఇండ్లు శాంక్షన్ అయినప్పటికీ కట్టుకోవటానికి జాగలు లేక ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే పరిస్థితి లేదని గ్రామస్తులు సిపిఎం నాయకులకు తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు జగన్, నిరంజన్ బీఎస్పీ నాయకులు పరమేస్వర్ గ్రామస్తులు రామస్వామి, విజయ్ ,శివ పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థికి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బి ఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెల్కపల్లి మండలంలోని గట్టు రావిపాకుల గ్రామానికి చెందిన బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్త కనుకు కాశన్న కుమార్తె కనుకు నవ్య శ్రీ ఇంజనీరింగ్ విద్యకోసం మాజీ శాసన సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి అండగా నిలిచారు,అమ్మాయి మొదటి సంవత్సరం కాలేజ్ ఫీజు 33,500 రూపాయల చెక్కు అమ్మాయి తల్లిదండ్రులకు అందజేశారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ మిగతా మూడు సంవత్సరాల ఫీజు కూడా తానే చెల్లిస్తానని తెలిపారు,ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల పాలిట వరం ముఖ్య మంత్రి సహాయనిధి

**రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన అశ్విని అనారోగ్యంతో హైదరాబాదులోని మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందడం జరిగింది గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో మంజూరైనా ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కును బి ఆర్ఎస్ నాయకులు కొండల్ ఆధ్వర్యంలో25,500రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు గోలి శ్రీనివాసరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తగుళ్ల కొండల్ యాదవ్, శ్రీనివాస, చిన్న సైదయ్య, వావిల్ల కొండల్, మార్కండేయుడు, శోభన్ చారి, తిరుపతయ్య, శేఖర్,కుమార్,భరత్ తదితరులు పాల్గొన్నారు.


## మంత్రి శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కడం మంథని ప్రజలకు గర్వకారణం

**- జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ**




**అగ్నిధార న్యూస్ మంథని :** ఇండియాస్ 100 మోస్ట్ ఇన్ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ 2025' జాబితాలో మంథని ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఏడవస్థానంలో నిల్వడం మంథని నియోజకవర్గ ప్రజలకు గర్వ కారణమని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ అన్నారు. తమ సమర్థవంతమైన నాయకత్వం, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహిమిస్తూ భారత్ ను ఏఐ రంగంలో అగ్రగామిగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్న వ్యక్తులకు ఇందులో చోటు కల్పించాగా శ్రీధర్ బాబుకు చోటు దక్కడం అభినందనీయం అన్నారు. రాష్ట్ర పురోభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిస్తు మన మంథని ఖ్యాతిని దశదిశలా చాటుతున్న మంత్రికి మనమంత అండగా నిల్వడంతోనే అది సాధ్యమయిందన్నారు. మంథని పై ప్రత్యేక దృష్టిసారించి విద్యారంగాన్ని, వైద్య రంగాన్ని, రవాణా రంగాన్ని ముందుకు తీసుకెళున శ్రీధర బాబు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. మంథని ప్రభుత్వ ధవాఖాన అభివృద్ధికి నిధులు 25 లక్షలు మంజూరీ చేసి అన్ని విభాగాల అభివృద్ధికి సహకరించినందుకు, ప్రజల ఆరోగ్యానికి బరోసా కల్పించుటకు కృషి చేస్తున్నందుకు, ఏడు కోట్ల నిధులతో గోదాముల నిర్మించుట, సోలార్ ప్లాంట్ నిర్మించుటకు ఐదు కోట్ల నిధులు శంకుస్థాపన చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ రానున్న రోజుల్లో మరిన్నిఅభివృద్ధి కార్యక్రమాలు చేస్తారని మంథని నియోజకవర్గాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతారని విశ్వసిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జి అన్నారు.

# ఔషధగిరికి అడుగు అడుగుల దండాలతో బయలుదేరిన తిరుమలయ్య భక్తులు



శ్రావణ మాసం ముగింపు శనివారంలో వనపర్తి పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి సమీపంలోని తిరుమలయ్య గుట్ట మరోసారి భక్తుల సందడితో కళకళలాడింది. పురాతన వైష్ణవ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఈ గుట్టపై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో ప్రత్యేకంగా వెలుగొందుతుంది. విష్ణువు స్వరూపుడైన స్వామివారి దర్శనం శ్రావణ శనివారాల్లో చేస్తే ఆయురారోగ్య సౌఖ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందుకే ఉదయం తొలిగంటల నుంచే అడుగుల అడుగుల దండాలతో భక్తులు గుట్టపైకి చేరుకున్నారు. ఈరోజు శ్రావణ మాసపు చివరి శనివారం కావడంతో భక్తుల రద్దీ మరింత ఎక్కువైంది. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి, హారతులు ఇచ్చారు. "గోవింద గోవింద" నినాదాలతో ఆలయ ప్రాంగణం మారుమోగిపోగా, మంత్రోచ్చారణలు, గంటల మోగింపుతో చుట్టుపక్కల వాతావరణం ఆధ్యాత్మిక మయమైంది. తిరుమలయ్య గుట్టకు చారిత్రక ప్రత్యేకత కూడా ఉంది. స్థానికుల వర్ణన ప్రకారం ఈ గుట్టలో ఒకప్పుడు అరుదైన ఔషధ మొక్కలు విరివిగా పెరిగేవని, సంజీవని వంటి దివ్య మూలికలు కూడా ఇక్కడ లభించేవని నమ్మకం ఉంది. అందుకే ఈ గుట్టను "ఔషధగిరి" అని పిలుస్తారు. ఇప్పటికీ ఇక్కడ కనిపించే అరుదైన వృక్షజాలాన్ని స్థానికులు పవిత్రంగా భావిస్తున్నారు. వనపర్తి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కొందరు గుట్టపైకి కాలినడకన చేరుకుని స్వామివారి దర్శనం చేసుకున్నారు. గుట్ట చుట్టూ వందలాది కుటుంబాలు పిక్నిక్ వాతావరణంలో గడిపి భక్తిశ్రద్ధతో పూజలు చేశారు. తరతరాలుగా భక్తి జ్వాలను రగిలిస్తున్న తిరుమలయ్య గుట్ట, ఈరోజు శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా మరొకసారి ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందింది.

# ప్రజా సమస్యలపై పోరాటానికి మరో ఉద్యమం తెలంగాణ జాగృతి


**తెలంగాణ జాగృతి నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి లోనే స్థానిక తెలంగాణ జాగృతి కార్యాలయంలో దారమోని గణేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఆంధ్ర పాలకుల చేతిలో అట్టడుగుకు తిరుగమనం వైపు ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మన నీళ్లు మనకు రావాలని ఎన్నో కొత్త ప్రాజెక్టులను నిర్మించి పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసిన ఘనత కేసిఆర్ ది. ఈరోజు ఆంధ్ర పాలకులు బనకచర్ల ప్రాజెక్టు నిర్మించడానికి ముందుకు వస్తే దాన్ని అడ్డుకునే సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేకపోవడం సిగ్గుచేటు. కల్వకుర్తి, నెట్టెంపాడు వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను నేటికీ పూర్తిస్థాయిలో పూర్తి చేయకపోవడం రేవంత్ ప్రభుత్వానికి సాగునీటిపైన, ప్రాజెక్టుల నిర్మించాలని దానిపైన చిత్తశుద్ధి లేకపోవడం వల్ల తెలంగాణ రైతాంగం నష్టపోతుంది గణేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ జాగృతి తెలంగాణ చారిత్రక, వారసత్వ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా ఆవిర్భవించిన తెలంగాణ జాగృతి 18 ఏళ్లుగా అనునిత్యం ప్రజల కోణంలో, ప్రజల కోసం పని చేస్తున్నది. ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి జాగృతి చేరుకుంటుంది. ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల పక్షాన నిలబడుతుంది. తెలంగాణ సాంస్కృతిక,వారసత్వ ప్రతీక బతుకమ్మ పండుగను విశ్వవ్యాప్తం చేసిన ఘనత తెలంగాణ జాగృతి సొంతం. సమైక్య పాలనలో ఆదరణ కోల్పోయిన మన పండుగలు, వేడుకలను సగౌరవంగా నిలబెట్టింది. రాష్ట్ర సాధన ఉద్యమంలో సకల జనులు, సబ్బండ వర్గాలను కలుపుకొని ఊరూరా పని చేసింది. తెలంగాణ వాదమే లేదు అని అవతలి వాళ్లు ప్రచారం చేసిన ప్రాంతాల్లోనూ సకల జనులను ఉద్యమం వైపు కదిలించడంలో జాగృతి క్రియాశీలంగా నిలబడింది. జై తెలంగాణ అని నినదించడానికి కూడా ఇష్టపడని ముఖ్యమంత్రి తెలంగాణ అస్తిత్వాన్నే చెరిపేసే అనేక కుట్రలకు తెరతీస్తున్న తరుణంలో జాగృతి ప్రజల వైపున నిలబడాల్సిన బాధ్యతను గుర్తించింది. పోరాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రం ఆగం కావొద్దని అడుగులు వేస్తున్నది తెలంగాణ ఉద్యమ సమయంలో ఊరూరా తెలంగాణ జాగృతి ఎంత పటిష్టంగా పని చేసిందో ఇప్పుడు కూడా అంతే బలంగా పని చేయాలని సంకల్పించింది. ఈక్రమంలోనే తెలంగాణ జాగృతి అనుబంధ విభాగాలతో పాటు జిల్లా అధ్యక్షులను నియమించి జాగృతిని సంస్థాగతంగా పటిష్ట పరచాలని అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నిర్ణయించారు. తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడిగా నాకు అవకాశం ఇచ్చి ప్రోత్సహించిన కవిత కి కృతజ్ఞతలు. కవిత ఆదేశాల మేరకు తెలంగాణ అస్తిత్వాన్ని పరిరక్షించడంతో పాటు సమస్యలను ఎదుర్కొంటున్న ప్రజల కోసం జాగృతి పక్షాన మేము పని చేస్తాం అని గణేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నేటికీ ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో లోతట్టు ప్రాంతాలను పరిరక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైనది .కొన్ని ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటించి పూర్తిస్థాయిలో లోతట్టు ప్రాంతాలను లేకుండా చేస్తామని చెప్పి నేటికీ దానిపైన ముందుకు పోకపోవడం విడ్డూరంగా ఉంది. హైడ్రా పేరుతో ప్రతిష్టాత్మక నగరమైన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా దెబ్బతింది అయినా దిద్దుపాటి చర్యలు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని తెలంగాణ ప్రజలు రోడ్లపైకి వచ్చే పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడింది. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు పెరుమాళ్ళకృష్ణ శేఖర్ సాదిక్,జంజీర్,రమేష్, బాబా తదితరులు పాల్గొన్నారు.

# పశువుల సంతను తలపిస్తున్న మంథని ప్రధాన చౌరస్తా

**అగ్నిధార న్యూస్ మంథని :** మంథని పట్టణంలోని ప్రధాన కూడలి అంబేద్కర్ చౌరస్తాలో ఎప్పుడు రద్దీగా నిత్యం భారీ వాహనాలు,ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఈ ప్రధాన చౌరస్తాను చూస్తుంటే మంథని మున్సిపాలిటీ యంత్రాంగం జవాబుదారు లేనితనం, నిర్వాహన చూస్తుంటే పశువుల సంతను తలపిస్తుంది. అసలు ఈ ఆవుల మందలు ఎవరివి.? వీటికి యజమానులు ఎవరు.? వీటి పోషణ ఎవరు చూసుకుంటున్నారు.?అనేది మున్సిపల్ యంత్రంగానికి,మంథని ప్రజానీకానికి అంతుచిక్కని సమస్యగా మారింది. ఎన్నిసార్లు ఈ పశువుల సమస్యతో పలు పత్రికల్లో ఎన్ని కథనాలు వచ్చినా ఈ మున్సిపల్ యంత్రాంగానికి మాత్రం నిమ్మకు నీరేతనట్లు,ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అసలు ఈ ఆవుల మందలు ఎవరివి ఎప్పుడు చూడు దారి పొడవునా వందల సంఖ్యలో దారి పొడవునా నిలుస్తూ ఉంటాయి. ఈ సమస్యతో ఇప్పటికి పలు ప్రమాదాలు జరిగి వాహనదారులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపిన దాఖలాలు అయితే లేవు. ఈ పశువుల సమస్యలతో ఎప్పుడు వాహనదారులకు,చిన్న చిరు,పండ్ల వ్యాపారస్తులకు ఎప్పుడు సమస్యలు తలెత్తుతున్న ఈ సమస్యకు ఎటువంటి పరిష్కారం మార్గం మంథని మున్సిపాలిటీ అధికారులు,సిబ్బంది చూపట్లేదు అనే భావన వినిపిస్తోంది. ఇప్పటికైనా అధికారుల్లో చలనం వచ్చి ఈ సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపుతారో లేదో వేచిచూడాలి.



## కల్వకుర్తి నియోజకవర్గం లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**కల్వకుర్తి నియోజకవర్గంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు,విశేష లక్ష పుష్పార్చన సామూహిక ప్రత్యేక పూజలు వేద పండితుల మంత్రోత్సవాల మధ్య నిర్వహించారు. అనంతర భక్తులు నగర సంకీర్తన, పల్లకి సేవ, భజన సంకీర్తనలతో పాటు ఉట్టి కొట్టడం తదితర కార్యక్రమాలను చేపట్టారు. కాగా పలువురు ప్రజాప్రతినిధులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సంకీర్తన భజన మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మంథని అశ్విని హాస్పిటల్ లో ఉచిత ఓపి సేవలు

**– ల్యాబ్ టెస్టుల్లో 30% రాయితీ**




**అగ్నిధార న్యూస్ మంథని :** దశాబ్ద కాలంగా మంథని నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తున్న మంథని అశ్విని హాస్పిటల్ 11 వ వార్షికోత్సవం సందర్భంగా ఉచితంగా ఓపి సేవలు అందిస్తున్నారు. అలాగే రక్త మూత్ర పరీక్షల్లో 30% రాయితీ (డిస్కౌంట్) ఇస్తున్నట్లు ఆసుపత్రి మేనేజ్మెంట్ వారు తెలిపారు. 11 రోజులపాటు జరిగే డాక్టర్ ఉచిత సేవల (ఉచిత ఓపి)ను ఆసుపత్రి ఫౌండర్ చిన్నపిల్లల వైద్య నిపుణులు నరేష్ ఆగంతం ప్రారంభించారు. మరో 10 రోజులపాటు ఉండే ఈ సేవలను నియోజకవర్గ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. 10 ఏళ్లుగా చూపుతున్న ఆదరణను అట్లాగే చూపించి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అలాగే ఆసుపత్రి ఫౌండర్ డాక్టర్ నరేష్ కృష్ణ ల్యాబ్ అధినేత సాయిని కృష్ణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎల్లంకి వంశీధర్ ను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ మోత్కూరి స్వర్ణలత శ్రీనివాస్, ఆస్పత్రి వైద్యుడు వెంకటరమణ ఆస్పత్రి స్టాప్ తదితరులు పాల్గొన్నారు.

## సుభాష్ యూత్ నూతన నియామకం.



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** కమాన్ పూర్ గ్రామ సుభాష్ యూత్ కమిటీని శనివారం మాజీ ఎంపీపీ మల్యాల రామచంద్రన్ గౌడ్ ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా మల్యాల రామచంద్రన్ గౌడ్ అధ్యక్షునిగా రేవల్లి శివ, ఉపాధ్యక్షుడిగా డొంకెన విజయ్, ప్రధాన కార్యదర్శులుగా పొన్నం రమేష్, కంజుల రాజ్ కుమార్, కోశాధికారిగా గజల్ శ్రీకాంత్, సహాయ కార్యదర్శిలుగా ఎండి అష్రఫ్ ,బొంగుని శివ, ప్రధాన సలహాదారులుగా గట్టు సతీష్ గౌడ్ రేవెల్లి శంకర్, అలాగే సభ్యులుగా గట్టు ఆకాష్ నల్లవెల్లి ఈశ్వర్ పొన్నం సిద్ధార్థ తదితరులు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. వీరికి సుభాష్ యూత్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## జిల్లాకు వస్తున్న రెజంగ్ల రజ్ కలశ యాత్రను విజయవంతం చేయాలి.




**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** ఈనెల 18న పెద్దపల్లిలో చేరుకుంటున్న రెజంగ్ల రజ్ కలశ యాత్రను విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్ అధ్యక్షతన యాదవ చారిటబుల్ ట్రస్ట్ కేంద్ర కార్యాలయంలో పత్రిక సమావేశంలో కోరారు. అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంధనవేణి రాజేందర్ యాదవ్, యాదవ చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు తమ్మడబోయిన ఓదెల యాదవ్ మాట్లాడుతూ జాతీయ కమిటీ దేశవ్యాప్తంగా రెజంగ్ల రజ్ కలశ యాత్ర ఏప్రిల్ 13న బీహార్లో ప్రారంభమై వివిధ రాష్ట్రాలలో కొనసాగిస్తూ ఈనెల 9న తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశించడం జరిగిందన్నారు. ఇట్టి యాత్ర 18న సోమవారం ఉదయం 10 గంటలకు పెద్దపల్లి జిల్లాలో ప్రవేశించి 11 గంటలకు పెద్దపల్లి జెండా చౌరస్తా నుండి యాత్రగా పెద్దపల్లి బస్టాండ్ వరకు కొనసాగుతుందని చెప్పారు. పెద్దపల్లి జిల్లాలో ఉన్న యాదవ కుల బాంధవులు అందరూ పెద్దపల్లి జెండా చౌరస్తా చేరుకొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ చిలారపు పర్వతాలు యాదవ్, యువజన విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు రాజం మహంత కృష్ణ యాదవ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అట్ల సాగర్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెత్తుల నాగరాజు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు బత్తిని లక్ష్మణ్ యాదవ్, జిల్లా కార్యదర్శి ధారవేణి పోచం యాదవ్, ఆసరి రాయమల్లు యాదవ్, లింగయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని ప్రతిమకు పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు.

అగ్నిధార



## ఓటీటీలో సంచలనం సృష్టిస్తోన్న అనీల్ గీలా మోతెవరి లవ్ స్టోరీ

భారతదేశంలో అతిపెద్ద స్వదేశీ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌గా %గజుజు%5 దూసుకుపోతోంది. బ్లాక్‌బస్టర్ ఒరిజినల్ సిరీస్‌లను, సూపర్‌హిట్ సినిమాలను అన్ని భాషల్లో అందిస్తూ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటోంది. సౌత్, నార్త్ మార్కెట్లలో %గజుజు%5 ప్రస్తుతం దుమ్ములేపేస్తోంది. ఇక %గజుజు%5 నిరంతరం ప్రాంతీయ భాషల్లో, ప్రాంతీయ కంటెంట్‌కు ప్రాధాన్యత ఇస్తూ.. తెలుగు, తమిళం, కన్నడ, మరాఠీ, గుజరాతీ, బంగ్లా, ఒడియా, భోజ్‌పురి, పంజాబీలలో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఉంది. ఈ క్రమంలోనే జీ5 తెలుగు ఇటీవల 'మోతెవరి లవ్ స్టోరీ' అంటూ ఓ అందమైన గ్రామీణ ప్రేమ కథను ఆడియెన్స్‌కు అందించింది. అనిల్ గీలా, వర్షిణిన ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన ఈ సిరీస్ ఆగస్ట్ 8న ప్రీమియర్ అయి.. అద్భుతమైన స్పందనను దక్కించుకుంది. కేవలం మూడు రోజుల్లోనే 4 లక్షలకు పైగా వ్యూయర్స్ ఈ సిరీస్‌ను వీక్షించారు. దీంతో రీజనల్ కంటెంట్ విభాగంలో 'మోతెవరి లవ్ స్టోరీ' సరి కొత్త బెంచ్ మార్క్‌ను సెట్ చేసినట్టు అయింది. ఈ కంటెంట్‌ను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి జీ5 తెలుగు ఇప్పుడు 99కి ప్రత్యేక నెలవారీ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్‌తో వీక్షకులు డాల్బీ అట్మాస్ ఆడియోతో నాణ్యతలో తెలుగు కంటెంట్‌ను 30 రోజుల పాటు ఆస్వాదించవచ్చు, ఈ ప్లాన్ ప్రకారం గరిష్టంగా రెండు పరికరాల్లో యాక్సెస్ చేసుకోవచ్చు. ప్రాంతీయ వినోదం పట్ల తన నిబద్ధతను విస్తరించుకుంటూ హిందీంపంజాబీంభోజ్‌పురి, తమిళం, కన్నడ, మలయాళం, మరాఠీంగుజరాతీ, బంగ్లాంఒడియాతో సహా ఇతర భాషలకు కూడా ఇలాంటి ?99 నెలవారీ ప్లాన్‌లను ప్రవేశపెట్టింది.

## సోషల్ మీడియాను షేక్ చేస్తున్న నికితా దత్త..



## రశ్మిక మూవీలో నోరా, మలైకా




నేషనల్ క్రష్ రశ్మిక మందన్న బాలీవుడ్‌లో ఫుల్ స్వాగ్‌తో రచ్చ చేస్తోంది. ప్రెజెంట్ అక్కడంతా అమ్మడి హవానే కనిపిస్తోంది. క్రేజీ ప్రాజెక్టులను చేతిలో పెట్టుకున్న ఈ చిన్నది .. ప్రస్తుతం తమా సినిమాలో నటిస్తోంది. ఆయుష్మాన్ ఖురానా హీరోగా చేస్తున్నాడు. బీటౌన్ లో సెన్సేషన్ క్రియేట్ చేసిన 'స్త్రీ యూనివర్స్'లో భాగంగా వస్తున్న ఈ సినిమా చుట్టూ మంచి బజ్ నడుస్తోంది. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ బయటకు వచ్చింది. రశ్మిక కీ రోల్ చేస్తుండటంతో ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. అయితే ఇప్పుడు ఇందులో మరో ఇద్దరు ముద్దుగుమ్మలు కూడా పాలుపంచుకోబోతున్నట్టుగా తెలుస్తోంది. బీ టౌన్ ఇంటర్నల్ సోర్స్ ప్రకారం ... ఈ చిత్రంలో మలైకా అరోరా నోరా ఫతేహి స్పెషల్ డాన్స్ నంబర్లలో మెరవనున్నట్టుగా తెలుస్తోంది. 'తమా' సినిమాలో మలైకా, నోరా ఇద్దరూ రెండు ఎనర్జిటిక్ డాన్స్ నంబర్లలో కనిపించనున్నారట. మలైకాతో కొన్ని నెలల క్రితం హై-వోల్టేజ్ సాంగ్ షూట్ చేయగా.., నోరా ఈ వారంలో తన సాంగ్‌ని కంప్లీట్ చేసిందని తెలుస్తోంది. మలైకా సాంగ్ సినిమాలో కీలక సన్నివేశంలో వస్తుందని, నోరా సాంగ్ మూవీ ఎండ్‌లో ప్రమోషనల్ ట్రాక్‌గా ఉంటుందని అంటున్నారు. ఈ సినిమా ఈ దీపావళి సీజన్‌లో రిలీజ్ కానుంది.'తమా'లో రష్మిక క్యారెక్టర్ గురించి ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. 'స్త్రీ యూనివర్స్' ఫ్యాన్స్‌కి ఈ మూవీ మరో బ్లాక్‌బస్టర్ ట్రీట్ ఇవ్వనుందని అంటున్నారు. ఇదిలా ఉంటే రశ్మిక నటించిన 'పుష్ప ది రైజ్' లో సమంత, 'పుష్ప ది రూల్' లో శ్రీలీల స్పెషల్ సాంగ్స్ తో ఊపేశారు. తమ గ్లామర్ తో పాన్ ఇండియాను షేక్ చేశారు బ్యూటీస్. ఇప్పుడు రశ్మిక నటిస్తున్న 'తమా' మూవీ లో ఈ హాట్ బ్యూటీలు చేస్తున్న పాటలు ట్రెండ్ అవుతుందని అప్పుడే లెక్కలు వేసుకుంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో!




### బాక్సాఫీస్ వద్ద రికార్డ్స్ తిరగరాసిన కూలీ..

## రజినీ వసూళ్ల సునామీ..

సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన సినిమా కూలీ. భారీ అంచనాల మధ్య ఆగస్ట్ 14న విడుదలైన ఈ సినిమాకు మొదటి నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తుంది. మాస్ యాక్షన్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రంలో అక్కినేని నాగార్జున విలన్ పాత్రలో నటించగా.. అమీర్ ఖాన్, ఉపేంద్ర, శ్రుతి హాసన్ కీలకపాత్రలు పోషించారు. ఇక ఈ చిత్రానికి మరో హైలెట్ అనిరుధ్ మ్యూజిక్. ఎప్పటిలాగే తలైవా ఇమేజ్, క్రేజ్ కు తగినట్లుగా బీజీఎంతో దుమ్మురేపాడు. 74 ఏళ్ల వయసులోనూ కుర్ర హీరోలకు ధీటుగా ఫిట్నెస్ తో వెండితెరపై మ్యాజిక్ చేస్తున్నారు రజినీ. ఇక ఈ సినిమాకు బాక్సాఫీస్ వద్ద మంచి రెస్పాన్స్ వస్తుంది. మొదటి రోజే ఈ సినిమా రూ.100 కోట్ల క్లబ్ లో చేరింది. నివేదికల ప్రకారం ఈ సినిమా స్వాతంత్ర్య దినోత్సవం రోజున అంటే విడుదలైన రెండు రోజు రూ.53.5 కోట్లకు పైగా వసూలు రాబట్టింది. ఈ ఏడాది అత్యధిక వసూళ్లు రాబట్టిన రెండో సినిమాగా కూలీ చిత్రం నిలిచింది. కూలీ సినిమా ప్రపంచవ్యాప్తంగా రెండో రోజు రూ.86 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఇందులో ఇండియా నుంచే రూ.55 కోట్ల వరకు తెలుగు, తమిళం, హిందీ భాషల నుంచి వచ్చినట్లు తెలుస్తోంది. మొత్తానికి రెండు రోజుల్లోనే కూలీ సినిమా 200 మార్క్ క్రాస్ చేసింది. ఇదిలా ఉంటే.. శనివారం సాయంత్రం 4 గంటల సమయానికి కూలీ దేశీయ బాక్సాఫీస్ వద్ద రూ.15.9 కోట్లు సంపాదించినట్లు సమాచారం. ఇందులో పూజా హెగ్డే మోనికా అంటూ స్పెషల్ సాంగ్ తో రచ్చ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో సౌబిన్ సాహిర్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఈ సినిమాలో నాగ్ మొదటిసారి విలన్ పాత్రలో అదరగొట్టేశారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com